RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 256 ISSUE NO : 256 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, ఏప్రిల్,8, 2026 Wednesday, April, 8, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## మణిపూర్‌లో..
# రాకెట్ దాడి
### ఇద్దరు చిన్నారులు మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తకర వాతావరణం చోటుచేసుకుంది. రాష్ట్రంలో సరిహద్దు భద్రతా దళ అధికారి ఇంటిపై రాకెట్ లేదా మోర్టార్ దాడి జరిగినట్టు తెలిసింది. ఈ దాడిలో సదరు అధికారి సతీమణి తీవ్రంగా గాయపడగా.. ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్టు సమాచారం. దీంతో మణిపూర్‌లో కొత్తగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మణిపూర్‌లో సరిహద్దు భద్రతా దళ అధికారి ఓయినం మాలెంగాన్బా బిష్ణుపూర్‌లోని కొండ–లోయ సరిహద్దు వెంబడి ఉన్న మోయిరాంగ్ గ్రామంలోని ట్రోంగ్లాబి అవాంగ్ లేకైలో నివాసం ఉంటున్నారు. కాగా, మంగళవారం తెల్లవారుజామున ఆయన ఇంటిపైకి ఓ రాకెట్ దూసుకొచ్చింది. పేలుడు సమయంలో అతడి భార్య 37 ఏళ్ల ఓయినం ఓంగ్బీ బినీతా, వారి ఇద్దరు పిల్లలు, ఐదేళ్ల బాలుడు, ఐదు నెలల పసికందు ఇంట్లోనే ఉన్నారు.

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డీఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు



## విజయన్, మోడీ మంచి
# మిత్రులు

హైదరాబాద్, ఏప్రిల్,7,తెలంగాణ దిశ : కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పం దం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచినాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది.విజయన్‌కు కేసీఆ ర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమ న్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని..



## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్
# ఖమేనీ
### కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

టెహ్రాన్, ఏప్రిల్ 7: ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా– ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది. అమెరికా– ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారడు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు.



## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ..?
### – పరిగిలో భూములు లాక్కునే యత్నం – సీఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్

హైదరాబాద్:పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపైహరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు.రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు.



### కాల్పుల విరమణ ప్రతిపాదన
## తిరస్కరించిన
# ఇరాన్!
### రాత్రికి రాత్రే తుడిచిపెడతామని ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం రాత్రి వరకు గడువు విధిస్తున్నామని, ఆలోగాదిగిరాకపోతే ఇరాన్‌నుఒక్క రాత్రిలో నే పూర్తిగా ఆక్రమించుకోగలమని, నాశనం చేయగలమని స్పష్టం చేశారు.



## పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ స్ట్రాంగ్
# వార్నింగ్
### రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్7 : పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు.



## అమెరికాకు షాకిస్తున్న..
# ఇరాన్
### 37 రోజుల్లో 40 విమానాలు ధ్వంసం!

ఢిల్లీ,:వారం రోజుల్లో ముగిసిపోతుందని భావించిన ఇరాన్‌తో యుద్ధం.. అమెరికా, ఇజ్రాయెల్ కూటమి అంచనాలను తలకిందులు చేస్తోంది. యుద్ధం మొదలై 37 రోజులు గడుస్తున్నా ఇరాన్ గట్టి ప్రతిఘటన చూపిస్తుండటంతో అమెరికా భారీ మూల్యం చెల్లించుకుంటోంది. ఇప్పటివరకు అమెరికాకు చెందిన 40 వైమానిక సంపత్తి ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం క్షేత్రస్థాయి వాస్తవాలకు అద్దం పడుతోంది. "ఇరాన్‌కు రాడార్లు, విమాన విధ్వంసక వ్యవస్థలు లేవు, మా విమానాలు సులువుగా లక్ష్యాలను ఛేదిస్తున్నాయి" అని ఏప్రిల్ 1న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రస్తుత పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి.




## వలస కార్మికులకు
# కేంద్రం శుభవార్త
### ఇక నుంచి 5 కెజీల రెండు సిలిండర్ల సరఫరా రాష్ట్రాలకు సూచించిన కేంద్రం

న్యూఢిల్లీ,ఏప్రిల్7 :వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది.



## 10 నుంచి భానుడి అసలైన
# భగభగలు

హైదరాబాద్, ఏప్రిల్,7,తెలంగాణ దిశ : రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎండలు దంచనున్నట్లు వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈనెల 10 నుంచి భానుడి అసలైన భగభగలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో గరిష్ఠంగా 43 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై భానుడు ఉగ్రరూపం చూపనున్నాడని.. ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండాకాలం మొదలైన తర్వాత ఆకస్మిక వర్షాలు కురుస్తుండటం చూస్తూనే ఉన్నాం. అదే సమయంలో భానుడి భగభగలు కూడా నమోదు అవుతున్నాయి. వడగండ్ల వానలతోపాటు.. ఎండలు కూడా భారీగానే ఉంటున్నాయి. ఈ క్రమంలోనే పూర్తి స్థాయి వేసవి కాలం.. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురిసి వాతావరణం కాస్త ప్రశాంతంగా ఉన్నప్పటికీ.. ఏప్రిల్ 10వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోనున్నాయని హెచ్చరిస్తున్నారు.రానున్న 10 రోజుల్లో తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## - కొలన్ హనుమంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పలువురు పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి తీసుకురావడంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. మంగళవారం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సూరారం కాలనీకి చెందిన ఎస్. అన్నపూర్ణమ్మకు రూ.45 వేలు, గురుమూర్తి నగర్ వాసి మహమ్మద్ అజారుద్దీన్‌కు రూ.50 వేలు, లాల్ బహదూర్ నగర్ వాసి గణేష్ శ్యామ్‌కు రూ.60 వేలు, సుభాష్ నగర్ వాసి కరోలు భారతికి రూ.60 వేలు, వెంకటేశ్వర కాలనీవాసి బి. కుమారికి రూ.60 వేలు, కృషి కాలనీ వాసి ముక్కర్ల హరీష్‌కు రూ.37,500, షాపూర్ నగర్ వాసి జి. జ్యోతికి రూ.60 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులకు ఆర్థిక సహాయం పొందవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రథమ కర్తవ్యంగా భావించి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# నాలా నిర్మాణంపై సందేహాలు

## - అధికారుల్లో కొరవడుతున్న స్పష్టత

**కాప్రా, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :కాప్రా ఊర చెరువు నుండి ప్రవహించే నాలా పరిధిలో గణపతి ఆలయం, సాకేత్ టవర్స్ మధ్య ఉన్న నిర్మాణంపై మరోసారి సందేహాలు తలెత్తుతున్నాయి. గతంలో ఈ నిర్మాణంపై అనేక అనుమానాలు వ్యక్తమవడంతో అధికారుల జోక్యంతో పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా తాజాగా అదే ప్రదేశంలో మళ్లీ కొంత మేర పనులు ప్రారంభమైనట్లు కనిపించడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నిర్మాణం చట్టబద్ధమేనా? నాలా బఫర్ జోన్‌కు భంగం కలుగుతుందా? అనే ప్రశ్నలు మళ్లీ ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ శాఖ, సంబంధిత హైడ్రా అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని స్థానికులు కోరుతున్నారు. నాలా బఫర్ జోన్‌ను కాపాడుతూ యజమానికి చెందిన భూమిలోనే నిర్మాణం కొనసాగుతుందని అధికారికంగా ప్రకటిస్తే ప్రజలకు స్పష్టత వస్తుందని అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా



పారదర్శకతతో పనులు కొనసాగితే ఎలాంటి అభ్యంతరాలు ఉండవని, కానీ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడితే దీనికి బాధ్యత వహించేది ఎవరు అనే విషయంపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు తక్షణమే స్పందించి స్పష్టత ఇవ్వాలని గగన్ కుమార్ కోరారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## - బిజెపి యువ నాయకుడు ఎస్. విభాకరన్ (బాబీ) ఆధ్వర్యంలో నాలుగు చోట్ల జెండా ఆవిష్కరణలు






**కాప్రా, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కాప్రా డివిజన్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ యువ నాయకుడు ఎస్. విభాకరన్ (బాబీ) ఆధ్వర్యంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆదేశాల మేరకు బీజేపీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు శాంతి కిరణ్ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సైనిక్ పురి, నిర్మల్ నగర్, సాయి నగర్, కాప్రా తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో జండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీజేపీ జెండాను ఘనంగా ఆవిష్కరించిన అనంతరం పార్టీ నాయకులు విభాకరన్ (బాబీ) మాట్లాడుతూ దేశ నిర్మాణం, అభివృద్ధి, ప్రజాసేవ పట్ల పార్టీ కట్టుబాట్లను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ కేడర్‌లో ఉన్న ఐక్యత, నిబద్ధత స్పష్టంగా కనిపించిందన్నారు. బీజేపీని బూత్ స్థాయి నుండి మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

## - మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి దేశానికి ప్రతిభావంతులైన క్రీడాకారులను అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాచుపల్లి మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి పిలుపు నిచ్చారు. కేఆర్‌సీఆర్ కాలనీలో సాయిబాబా ఆలయం వెనుక నిర్వహించిన అండర్-14 సబ్ జూనియర్స్ క్రికెట్ పోటీల్లో పాల్గొని విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అండర్-14 క్రికెట్ జట్టు కెప్టెన్ ఆర్ఎస్‌జి (రాకేష్ శేఖర్)ను ప్రత్యేకంగా ఆహ్వానించి యువ ఆటగాళ్లకు పరిచయం చేసి ప్రేరణనిచ్చారు. పోటీల్లో విజేతలు మరియు రన్నర్-అప్ జట్లకు బహుమతులు అందజేశారు. ప్రతిభను గుర్తించి సరైన ప్రోత్సాహం అందించడం ద్వారా క్రీడల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు, కాలనీవాసులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో బీజేపీ కార్యాలయం ప్రారంభం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :బాచుపల్లిలో భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హరితవనం కాలనీలోని గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, బీజేపీ కార్యకర్తలు ప్రజల గొంతుకగా మారాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయం సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా ఉండాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, గోపు రమణారెడ్డి, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, ప్రసాద్ రాజు, భిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, కొంపల్లి రాజిరెడ్డి, సతీష్ సాగర్, దాశి నాగరాజు, సులోచన తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలానగర్‌లో రేషన్ వినియోగదారులకు అవగాహన సదస్సు




**హెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ తిరుమలానగర్ కాలనీలోని రేషన్ దుకాణ ప్రాంగణంలో మంగళవారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ డి. సంధ్య, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ రెడ్డి, ఇన్ స్పెక్టర్లు కిరణ్ కుమార్, దినేష్ పాల్గొని రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. స్థానిక డీలర్ మల్లేష్ గౌడ్ దుకాణం వద్ద నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు వినియోగదారులతో నేరుగా మాట్లాడారు. రేషన్ బియ్యం నాణ్యత, బరువు, పంపిణీలో ఎదురవుతున్న సమస్యలపై కార్డుదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ -కెవైసి నమోదు, రేషన్ కార్డుల వినియోగంపై ప్రజలకు అవసరమైన సూచనలు అందించారు. ఫిర్యాదులు ఉంటే ఎలాంటి సంకోచం లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇక ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, రేషన్ కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం అధికారులు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య స్వయంగా వినియోగదారులకు పానీయాలు అందించారు. ఎండలో క్యూలైన్లలో నిలబడే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువగా నీరు తాగాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఎండల దృష్ట్యా సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ సిబ్బంది, స్థానిక వినియోగదారులు పాల్గొన్నారు.

# ఘనంగా షరీఫ్ ముబారక్ కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 07, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి గ్రామంలోని హజ్రత్ సయ్యద్ రహమతుల్లా షా ఖాద్రి (జీతే ఫీర్ దర్గా)లో నిర్వహించిన షరీఫ్ ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని, సాంప్రదాయ కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షరీఫ్ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌహార్దం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అన్ని మతాలను సమానంగా గౌరవించే భారతదేశ సంస్కృతి విశిష్టమైనదని, ఇటువంటి కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలపరుస్తాయని ఆయన పేర్కొన్నారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కొత్త నేతల కోసం పార్టీల ఎదురుచూపులు

**విజయవాడ,తెలంగాణ దిశ** :ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణా మాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు వైసీపీలో నాయకత్వాన్ని ప్రశంసించే వారు కొందరైతే, క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసే వారు మరో వర్గంగా కనిపిస్తున్నారు. అదే పరిస్థితి టీడీపీ లో కూడా కనిపి స్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురించి, మంత్రి నారా లోకేష్ గురించి ఎక్కువగా పొగిడే నాయకులు ఒకవైపు ఉంటే, నిశ్శబ్దంగా పని చేసే వారు మరోవైపు ఉన్నారుఇటీవల చంద్ర బాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందిస్తూ, మాటలకంటే పని చేసే వారినే పార్టీ గుర్తిస్తుందని స్పష్టం చేశారు. మీడియా ముందువిమర్శలు చేయడం, ప్రత్యర్థి పార్టీలపై దాడి చేయడం ద్వారా మైలేజ్ పొందే ప్రయత్నాలను ఆయన తప్పుపట్టారు. ఇదే సమయంలో వైసీపీ)లో ఇలాంటి మందలింపులు బయటకు రావడం లేదు అనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా ఇప్పుడు కీలకంగా మారింది. దాదాపు 50 శాతం వరకు నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారు 88 అసెంబ్లీ స్థానాలు, 12 పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశముందని వార్తలు వస్తున్నా యి. ఈ మార్పుల నేపథ్యంలో పార్టీలకు కొత్త నాయకుల అవసరం తప్పనిసరిగా మారింది.అయితే ఇక్కడే అసలు సమస్య కనిపిస్తోంది. బాగా చదువుకున్న నాయకులను ఎంపిక చేయాలని అనుకుంటే, అలాంటి వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మరోవైపు సాధారణ స్థాయి నాయకులు ఉన్నా, వారిలో సామర్థ్యం ఎంత అనే ప్రశ్న ముందుకు వస్తోంది. కేవలం పొగడ్తలు చెప్పే వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు భావి స్తున్నారు. క్షేత్రస్థాయిలో జెండా మోస్తూ పని చేసే కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వాలనే ఆలోచన కూడా ఉంది. కానీ అక్కడ ఎమ్మె ల్యేలు, ఎంపీలు ఇచ్చే సిఫారసులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కారణంగా సరైన వ్యక్తిని ఎంపిక చేయడం పార్టీలకు సవాల్‌గా మారింది. ప్రతి నియోజకవర్గంలో పరిస్థితులు ఒకేలా లేకపోవడం కూడా సమస్యను పెంచుతోంది.కొన్ని జిల్లాల్లో నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో సరైన నాయకత్వం కొరతగా ఉంది. ఈ అసమతుల్యత కారణంగా పార్టీలకు నిర్ణయాలు తీసుకోవడం కష్టం అవుతోంది. భవిష్యత్తులో బలమైన నాయకత్వం అవసరం పెరుగుతుందని స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, రాజకీయ పార్టీలకు ప్రస్తుతం నాయకుల ఎంపిక ఒక కీలక పరీక్షగా మారింది. సరైన వ్యక్తులను గుర్తించి అవకాశాలు ఇవ్వడం ద్వారా మాత్రమే భవిష్యత్తులో విజయాన్ని సాధించగలవు. నాయకులు తమ సామ ర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. అదే సమయంలో పార్టీలు కూడా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు



**నిర్మల్,తెలంగాణ దిశ** :జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు స్థానిక ఎన్.టీ.ఆర్ మినీ స్టేడియంలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుండి సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా ప్రతిభను గుర్తించి, ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీ.వై.ఎ స్.ఓ శ్రీకాంత్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పీడీ రమణారావ్,పీఈటీ భోజన్న,పీడీలు లక్ష్మణ్,సత్తయ్య, ఎం. సత్య నారాయణ, కె. శ్రీనివాస్, ఆర్. వెన్నెల, శారదా, సంజు రాథోడ్, కవిత, వంశీధర్, నచ్చేందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనఖీ చేసిన జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ** : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మి ప్రసన్నను పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకు న్నారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 200 మంది రెగ్యులర్ విద్యార్థులు, 3 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, నిర్వహించిన గణితం పరీక్షకు మొత్తం 203 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిభిరాన్ని పరిశీలించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న మందులు, చికిత్సలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అస్వస్థత కలిగితే వెంటనే వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అత్యవసర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

# కల్తీ బిస్కెట్లు..! ప్రజల ప్రాణాలతో చెలగాటం



**హైదరాబాద్,తెలంగాణ దిశ** :అంబర్‌పేట్ ప్రాంతంలో నకిలీ (కల్తీ) ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీ పై పోలీసులు, ఆహార భద్రత అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బిస్కెట్లకు ఆకర్షణీయ మైన రంగు, రుచి కలిగిం చేందుకు నిషేధిత, ప్రాణాంతక రసాయనాల ను వినియోగిస్తున్నట్లు అధికా రులు గుర్తించారు. అంతేకాకుండా, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి పెంచేందుకు కుళ్ళిపోయిన, పాడైన గుడ్లను ఉపయోగిస్తున్నట్లు ఆధారాలతో సహా గుర్తించారు. ఫ్యాక్టరీలో కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, ఈగలు ముసురుతున్న మురికి వాతావరణంలోనే తయారీ కొనసాగిస్తు న్నారు.

# సంపాదకీయం

## మహిళా లీడర్లు కావలెను

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక భారీ మార్పు రాబోతోంది. నియోజకవర్గాల పునర్విభజనతో పెరగనున్న సీట్లు , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రానుండటంతో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ యవనికపై మహిళా నేతల హవా మొదలుకానుంది. ఇప్పటి వరకు పురుషాధిక్య రాజకీయాల్లో అవకాశాల కోసం ఎదురుచూసిన ఎంతో మంది చైతన్యవంతులైన మహిళలకు ఇది నిజంగానే గోల్డెన్ టైమ్ అని చెప్పవచ్చు. ప్రతి ముగ్గురు ఎమ్మెల్యేలలో ఒకరు కచ్చితంగా మహిళా నేతే ఉండబోతుండటంతో, ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మహిళా కేడర్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డాయి. 2029 అసెంబ్లీ ఎన్నికలు.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతోపాటు 33 శాతం మహిళా రిజర్వేషన్లు కూడా అమలు కానున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఏ ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసినా పెరగబోయే స్థానాలు, మహిళా రిజర్వేషన్? కింద దక్కబోయే సీట్లపైనే చర్చించుకుంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో ఇప్పుడున్న 119 అసెంబ్లీ సీట్లు 179కి పెరగనున్నాయి. 33 శాతం విమెన్ ?రిజర్వేషన్ అమలైతే తెలంగాణలో వారికి ఏకంగా 59 సీట్లు దక్కనున్నాయి. మహిళలకు ఇంత పెద్ద సంఖ్యలో అసెంబ్లీ సీట్లు రిజర్వుకానుండడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తమ కుటుంబాల్లోని మహిళలకు రెండో సీటుపై ఇప్పటి నుంచే కన్నేస్తున్నారు. ఆ దిశగా భార్య, కూతు రు, కోడలుతో రాజకీయ పరిచయ కార్యక్రమం చేయిస్తున్నారు. పండుగలు, పబ్బాలు, ఇతర శుభ కార్యాలను పురస్కరించుకొని ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు శుభాకాంక్షలు చెపుతూ ఫ్లెక్సీలు, హోర్డింగ్?లు, కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీటిపై జనాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరిగితే అందులో సుమారు 80 స్థానాలు మహిళలకే కేటాయించాల్సి ఉంటుంది. అలాగే తెలంగాణలో 60 స్థానాలు మహిళలకు రిజర్వ్ అవుతాయి. అంటే రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 140 మందికి పైగా మహిళా ఎమ్మెల్యేలు చట్టసభల్లో అడుగుపెట్టబోతున్నారు. గతంలో కేవలం 10 నుంచి 15 శాతం లోపే ఉన్న మహిళా ప్రాతినిధ్యం, ఇప్పుడు ఏకంగా 33 శాతానికి పెరగడం రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేయనుంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, చాలా చోట్ల భర్తలు లేదా కుటుంబ సభ్యులు ప్రాక్సీ లుగా పాలన సాగించేవారు. కానీ, అసెంబ్లీ స్థాయికి వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉండబోతోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వాడకం, పెరిగిన విద్యావంతుల సంఖ్య, మహిళల్లో వచ్చిన రాజకీయ చైతన్యంతో సొంతంగా ఎదిగే నేతలకే ప్రాధాన్యత పెరగనుంది. పార్టీలు కూడా కేవలం డమ్మీ అభ్యర్థులను కాకుండా, ప్రజల్లో పట్టున్న, సొంతంగా గెలవగల సామర్థ్యం ఉన్న మహిళా నేతలకే టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలైన టీడపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, బీఆర్ఎస్, కాంగ్రెస్ , బీజేపీలలో ద్వితీయ శ్రేణి మహిళా నాయకత్వం బలంగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై గళం విప్పడం వంటి పనుల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖచ్చితం కావడంతో, ఇప్పటి వరకు తెర వెనుక ఉండి పనిచేసిన మహిళా నేతలు ఇప్పుడు నేరుగా ప్రజల ముందుకు వచ్చి తమ నాయకత్వ లక్షణాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇది రాజకీయాల్లో ఒక రకమైన వడపోత కు దారితీసి, అసలైన సమర్థులైన మహిళా నేతలను బయటకు తీస్తుంది. మహిళా రిజర్వేషన్ల వల్ల కేవలం లింగపరమైన ప్రాతినిధ్యమే కాకుండా, సామాజిక సమీకరణాలు కూడా మారుతాయి. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో మహిళా నేతల ఎంపిక కోసం పార్టీలు కొత్త వ్యూహాలను రచించాల్సి ఉంటుంది. మహి ళా ఓటర్లు అత్యధికంగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో, ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక సమస్యలపై చర్చ ఎక్కువగా జరుగుతుంది. ఇది రాజకీయాల్లో క్వాలిటీ ని పెంచుతుందనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల్లో మహిళా నేతలకు రాబోయే ఐదేళ్లు అత్యంత కీలకం. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు వారు చేరుకోబోతున్నారు. పార్టీలు కూడా తమ గెలుపు గుర్రాలను వెతుక్కునే క్రమంలో మహిళా అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నాయి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చమురు మంటలు.. సామాన్యులే సమిధలు!





ఆకస్మికంగా తలెత్తిన చమురు సంక్షోభంతో భారత్ అల్లాడుతోంది. పెట్రోలు బంకుల్లో కొరత కనిపిస్తోంది. భయాందోళనలతో ప్రజలు ఎక్కువెక్కువగా కొనుగోలు చేస్తుండటంతో నిల్వలు ఖాళీ అవుతున్నాయి. కొన్ని పంపుల దగ్గర భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. క్యాబ్‌లు, ఆటోవాలాలు ట్రిప్పులు రద్దు చేసుకుంటున్నారు. వంటగ్యాస్ సమస్యతో హోటళ్లు మూతపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం మన దేశంలో సామాన్య జనజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంధన అందుబాటుకు సంబంధించి దేశవ్యాప్తంగా నెలకొన్న గందరగోళానికి మూలాలు ఫిబ్రవరి చివర్లోనే పడ్డాయి. ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీలో భాగంగా అమెరికా–ఇజ్రాయెల్‌లు ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో సుప్రీం నేత ఖమేనీ మరణించడంతో ప్రతీకార జ్వాలలు ఎగసిపడ్డాయి. కీలకమైన చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో సౌదీ అరామ్‌కోకు చెందిన రస్‌తానూరా రిఫైనరీ తీవ్రంగా దెబ్బతినడంతో అది పూర్తిగా మూతపడింది.

యూఏఈకి చెందిన అడ్నాక్ ఫుజైరా కార్యకలాపాలను 30శాతందాకా తగ్గించింది. ఖతార్‌లోని రస్‌లఫాన్ ఎల్ఎన్‌జీ కేంద్రం ఉత్పత్తిని నిలిపివేసింది. ఇరాక్ ఎగుమతులు రోజుకు 15లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. భద్రతాపరమైన భయాలతో కువైట్ చమురు క్షేత్రాలు నిలిచిపోయాయి. మునుపెన్నడూ లేనిరీతిలో ముప్పు ఎదుర్కొంటున్న గల్ఫ్ ఉత్పత్తిదారులు ప్లాంట్లను మూసివేయడమో, ఉత్పత్తిని బాగా తగ్గించడమో చేస్తున్నారు.

ఇండియాకు ఇక్కట్లు :అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఒత్తిడి పెంచేందుకు హర్మూజ్ జలసంధిని ఇరాన్ ఒక భౌగోళిక ఆయుధంగా మార్చి ప్రయోగించింది. ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచ చమురులో 20శాతం చమురుతోపాటు, భారీస్థాయిలో ద్రవీకృత సహజ వాయువు రవాణా జరుగుతుంది. అయితే, ఈ మార్గంలో రోజుకు డజన్లకొద్దీ సాగే ట్యాంకర్ల రాకపోకలు దాదాపు సున్నాకు పడిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి. 150కి పైగా నౌకలు తీరానికి దూరంగా లంగరు వేసి ఉన్నాయి. ఈ మొత్తం పరిణామంలో అసలైన సమస్య బీమా కంపెనీల నుంచే ఎదురైంది. 90శాతం సముద్రయాన నౌకలకు ప్రాతినిధ్యం వహించే ఏడు ప్రధాన సంస్థలు యుద్ధ ప్రమాద రద్దు నోటీసులను జారీ చేశాయి. బీమా లేకపోతే బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ఓడరేవులు ఓడలను నిలపడానికి నిరాకరిస్తాయి. యజమానులు సరకులను పక్కనపెడతారు. ఒకవేళ ఆఫ్రికాలోని కేప్ ఆఫ్ గుడ్‌హోప్ చుట్టూ తిరిగివచ్చేలా మార్గాన్ని మళ్లిస్తే, పదిహేను రోజులదాకా అదనపు సమయం పడుతుంది. ఇంధన ఖర్చులు అదనంగా లక్షల డాలర్లవుతాయి. దీనంతటి వల్ల యుద్ధ ప్రమాద ప్రీమియంలు రెట్టింపు లేదా మూడురెట్లు పెరిగిపోయాయి. కనిపించని దిగ్బంధనం మందుపాతరలు, యుద్ధనౌకలకన్నా ప్రమాదకరంగా తయారైంది. ఈ పరిణామాలకు ప్రతిస్పందనగా ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ప్రధాన ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ గణనీయంగా పెరిగింది.

ఈ పరిణామాలతో ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉన్న ఇండియా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. తన అవసరాలలో 85శాతందాకా విదేశీ ముడిచమురుపైనే ఆధారపడి ఉంది. ఇందులో 35నుంచి 50శాతం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌ల నుంచి హర్మూజ్ మార్గం ద్వారా వస్తుంది. వంటకు వాడే ఎల్పీజీలో సుమారు 80శాతం, ఎల్ఎన్‌జీలో సగం ఇదే మార్గంగుండా వస్తాయి. వ్యూహాత్మక నిల్వలు రెండు నెలల వరకు ఆసరా ఇస్తాయి. నిల్వ, రవాణాలో సుమారు 10కోట్ల బ్యారెళ్లు ఉన్నాయి. కానీ, భయాందోళనలు ప్రణాళికలన్నింటినీ దెబ్బతీశాయి. ఇండియన్ ఆయిల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు రష్యా, అమెరికా,బ్రెజిల్, పశ్చిమాఫ్రికాసరఫరాల కోసం పోటీపడు తున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపులు ఇవ్వడంతో రష్యా చమురు రాయితీపై వస్తోంది. ఇది హర్మూజ్‌యేతర మార్గాల ద్వారా వస్తూ 40శాతం డిమాండ్‌ను తీరుస్తోంది. అయినప్పటికీ గల్ఫ్ ముడి చమురు, ఎల్ఎన్‌జీకి పూర్తి ప్రత్యామ్నాయంగా మారలేకపోతోంది. క్షేత్రస్థాయిలో ఈ సంక్షోభం వేగంగా విజృంభిస్తోంది. ప్రజలు భయాందోళనలతో చమురును కొనుగోలు చేస్తుండటంతో బంకులు మూతపడుతున్నాయి. కుటుంబాలు ప్రత్యామ్నాయాల కోసం వెదుకుతున్నాయి. గ్రామాలకు మార్కెట్లతో సంబంధాలు తెగిపోతున్నాయి. పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయి. నమ్మకమైన రవాణా లేకపోవడంతో నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పాఠశాలలు ఆలస్యమవుతున్నాయి. కార్యాలయాలు ఖాళీ అవుతున్నాయి. ఆసుపత్రులు జనరేటర్ల కోసం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో వాడుతున్నాయి. కొన్నిరకాల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. రవాణా, ఆహారం, విద్యుత్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఆర్థికంగా అన్ని వైపుల నుంచి తాకిడి పెరుగుతోంది. భారత ఎగుమతుల్లో 17శాతాన్ని గల్ఫ్ దేశాలు స్వీకరిస్తున్నాయి. విస్తృత మార్కెట్లకు ముఖద్వారాలుగా ఉన్న యూఏఈ, సౌదీ హబ్‌లు ఇప్పుడు సరఫరాలో జాప్యాలు, ఆకాశాన్ని అంటుతున్న రవాణా ఛార్జీలు, యుద్ధ రుసుములతో సతమతమవుతున్నాయి. దాంతో చిన్న, మధ్యతరహా ఎగుమతిదారుల లాభాలు కనుమరుగవుతున్నాయి.

భౌగోళిక రాజకీయాలకు మూల్యం : పరిస్థితులు గందరగోళంగా మారడంతో ప్రభుత్వం పలు చర్యలతో రంగంలోకి దిగింది. చమురు కొరత లేదంటున్న అధికారులు ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నారు. దౌత్యం ద్వారా త్వరలోనే హర్మూజ్ జలసంధి సమస్య పరిష్కారమయ్యేలా కనపడుతోంది. ముడిచమురు ధర 85–90 డాలర్ల దగ్గర స్థిరంగా ఉంటుందనే ఆశావాదం వ్యక్తమవుతోంది. భారత్ తన దగ్గరి నిల్వలతోపాటు, రష్యా సరఫరాలతో గండంలోంచి బయటపడుతుందని అంచనా వేస్తున్నారు. జీపీఎస్ జామ్‌లు, ఇరాన్ అణు బెదిరింపుల వల్ల బీమా స్తంభనలు దీర్ఘకాలం కొనసాగుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎరువుల కొరతపై వార్తలు రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఈ గందరగోళం భారతదేశ ఇంధన బలహీనతను బయటపెడుతోంది. ఇండియాతో పాటు మరికొన్ని దేశాల్లోనూ పరిస్థితులు ఇలాగే అగమ్యగోచరంగా ఉన్నాయి. సుదూర తీరాల్లోని భౌగోళిక రాజకీయాలకు సామాన్యులు మూల్యం చెల్లించాల్సిన అగత్యం నెలకొంది. యుద్ధవిరమణ దిశగా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేస్తేనే ఈ సంక్షోభం సమసిపోతుంది.




## టర్మ్ ఇన్సూరెన్స్‌తో..
# రికార్డ్ క్రియేట్ చేస్తారా..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వ బడ్జెట్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రకటన "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్". డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రకారం, 2026 జూన్ 2 నుంచి రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పేదలు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ ఈ పథకం వర్తిస్తుందనడం వల్ల ఈ హామీ సాధారణ సంక్షేమ పథకాన్ని మించిన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా ఆర్థికంగా కుంగిపోకుండా రక్షించే సోషల్ సెక్యూరిటీ స్కీం అనొచ్చు. ఉపముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్టు తెలంగాణ యే దేశంలో మొదటిదా అంటే కాదని చెప్పొచ్చు. ఎందుకంటే నాగాలాండ్ ఇప్పటికే పేరుతో 2024 ఆగస్టు 15న ఒక రాష్ట్రవ్యాప్త కుటుంబ–ఆధారిత బీమా మోడల్‌ను ప్రారంభించింది. ఆ పథకంలో కుటుంబ పోషకుడు మరణించినప్పుడు రూ.2 లక్షల జీవిత బీమా కల్పించింది. అయితే లబ్దిదారుల సంఖ్యాపరంగా చూస్తే కేవలం 2.5 లక్షల కుంటుంబాలు మాత్రమే అంటే తెలంగాణ లబ్దిదారుల్లో అవి కేవలం 2.1 శాతం మాత్రమే.. అందువల్ల తెలంగాణ మొట్టమొదటి రాష్ట్రం కాదు కానీ కోటీ పదిహేను లక్షల కుటుంబాలు లక్ష్యంగా ఇంత పెద్ద స్థాయి పథకం మాత్రమే తెలంగాణ మాత్రమే అని చెప్పొచ్చు. ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనతో పోల్చితే... ఖఓఏఏఃజ వ్యక్తిగత జీవిత బీమా పథకం. దానిలో ఏదేని కారణంతో బీమా పొందిన వ్యక్తి మరణిస్తే రూ.2 లక్షల కవరేజ్ ఉంటుంది. అందులో చేరేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు వారై ఉండాలి. ఈ పథకం బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతా ద్వారా, ప్రతి సంవత్సరం రూ.436 ప్రీమియం మన బ్యాంకు ఖాతా నుంచి ఆటో–డెబిట్ అవుతోంది. అంటే ఇది అందరికీ అందే సార్వత్రిక పథకం కాదు; వ్యక్తిగతంగా నమోదు చేసుకుని పథకంలో చేరితేనే వర్తిస్తుంది. తెలంగాణ ప్రకటించిన పథకం మాత్రం మరింత విస్తృతమైంది. ఇది కుటుంబం ఒక యూనిట్‌గా, రూ.5 లక్షలు బీమా కవరేజీ వర్తిస్తుంది. పైగా ప్రభుత్వం దీన్ని సంక్షేమ హామీగా ప్రకటిస్తోంది, ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ తేడా చిన్నది కాదు ఒకరకంగా చెప్పాలంటే ప్రజాసంక్షేమ విధానంలో చాలా పెద్ద ముందడుగు. "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్"కు సంబంధించిన పూర్తి విధి విధానాలింకా రూపొందించలేదు. కేంద్ర పథకం ఖఓఏఏఃజతో తెలంగాణ స్కీమ్‌ను కలపగలరా అనే ఆలోచనపై ఇప్పటికెలాంటి స్పష్టతా లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పలు వెసులుబాట్లు పరిశీలించొచ్చు. ఒకటి, రాష్ట్రమే సొంతంగా ఒక గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం నడపడం. రెండోది, ఖఓఏఏఃజని ఆసరా చేసుకుని దానికి రాష్ట్రం టాప్–అప్ కవరేజ్ ఇవ్వడం. మూడోది, అర్హులైన వారికి ప్రీమియం రాష్ట్రం చెల్లించి, మిగిలిన వర్గాలకు వేరుగా పథకం అమలుచేయడం. కానీ ఒక సమస్య ఉంది. ఖఓఏఏఃజలో వయో పరిమితి, బ్యాంక్ ఖాతా, ఇనీనిబవనిబి, జీనినిబీజీశ్రీ తీవనివలిజీశ్రీ వంటి షరతులు ఉన్నాయి. తెలంగాణ బడ్జెట్ ప్రసంగంలో మాత్రం "అందరికీ" అనే మాట ఉంది. కాబట్టి రాష్ట్రంపై భారం మాత్రం భారీగానే వుండొచ్చు. పేదల కోసం, గ్రామీణ భూమి లేని కుటుంబాల కోసం, అసంఘటిత కార్మికుల కోసం, ప్రమాద బీమా అవసరమున్న వర్గాల కోసం గతంలో ఇలాంటి పథకాలు వచ్చాయి. కానీ "ప్రతి కుటుంబానికి జీవిత బీమా" అనే స్థాయిలో, రాష్ట్రంఅధికారికంగా పెద్ద ఎత్తున హామీ ఇవ్వడం మాత్రం తెలంగాణనే మొదటి రాష్ట్రం. అందుకే తెలంగాణప్రకటన రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకోనుంది. పైగా కేవలం పేదలకే పరిమితం కాకుండా మధ్యతరగతి, ఎగువ తరగతుల వారికీ బీమా అందించడం సంక్షేమ పథకాల అమలులో ఓ పెద్ద మలుపు.

ఐదు ప్రధాన సవాళ్లు: మొదటిది కుటుంబ నిర్వచనం– కుటుంబం అంటే ఎవరెవరు? రెండోది కుటుంబ పోషకుడు గుర్తింపు– ఒక కుటుంబంలో ఇద్దరు సంపాదిస్తే? మహిళే ప్రధాన ఆదాయ వనరు అయితే? మూడోది వయస్సు, రిస్క్, ప్రీమియం భారం ? వయస్సు పరిమితి లేకుండా పెద్ద ఎత్తున కవరేజ్ ఇస్తే ప్రీమియం ఖర్చు గణనీయంగా పెరగొచ్చు. నాలుగోది లబ్దిదారుల జాబితా ? లబ్ధిదారుల డేటాబేస్ బలంగా లేకపోతే క్లెయిమ్‌ల వద్ద వివాదాలు మొదలవుతాయి. ఐదోది, అంతకంటే ముఖ్యమైనది క్లెయిమ్ సెటిల్‌మెంట్ వేగం. ఇప్పటికే ఇలాంటి పథకం అమలవుతున్న నాగాలాండ్‌లో ఎదురవుతున్న ప్రధాన సవాలు.

మొత్తానికి పథకం విజయవంతంగా అమలైతే ఆరోగ్యశ్రీ పథకంతో రాజశేఖర్ రెడ్డికి, రైతు భీమా, రైతు బందుతో కేసీఆర్‌కి వచ్చిన మంచి గుర్తింపు రేవంత్ రెడ్డికీ వస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగా తెలుగు రాష్ట్రం మరోసారి దేశానికి ఆదర్శంగా నిలవగల స్థాయి ఈ అందరికీ ఉచిత జీవిత బీమా పథకానికుంది. కాబట్టి అవరోధాలు లేకుండా అమలు చేయడంలోనే రేవంత్ సర్కార్ సత్తా నిరూపితమౌతుంది.

# అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: మంత్రి పొన్నం



**ఆదిలాబాద్,తెలంగాణ దిశ :** మహా లక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజకవర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్ ల అభివృద్ధి , కొత్త రూట్లు,బస్ డిపో ల అవసరాలపై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు అదిలాబాద్ , కరీంనగర్ , ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ -1 లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి తో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి సూచించారు. సింగరేణి ఏరియాలో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జగిత్యాల నుండి కడెం బస్సులు నడిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. ఆదిలాబాద్ , కరీంనగర్ , హైదరాబాద్ కి బస్సులు పెంచాలన్నారు. ఉట్నూరు ఆదిలాబాద్ మధ్య బస్సులు నడిపించాలని ఉట్నూరు ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. నిజాం కాలంలో నిర్మించిన ఆసిఫాబాద్ పురాతన బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ లో ఫ్లాట్ ఫాం సంఖ్య పెంచాలని కోరారు. 5 పల్లె వెలుగు బస్సులు గ్రామాలకు నడపాలని కోరారు. నియోజకవర్గం నుండి వేములవాడ , కొండగట్టు కి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. ఆర్టీసీ పెట్రోల్ బంకు ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. బోథ్ లో చాలా రూట్ లలో బస్సులు బంద్ అయ్యాయని కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని కోరారు. ఇచ్చోడ బస్ స్టేషన్ 18 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉందని దానిని అభివృద్ధి చేయాలని కోరారు. సిరికొండ , తలైగూడ, కరంజీ, నిగ్నె , వధురు , కుంతల మీదుగా బస్సులు నడపాలని సూచించారు. 2027 జూన్ లో పుష్కరాలు సమీపిస్తుండటంతో బాసర లో బస్ స్టేషన్ ఆధునీకరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ విజ్ఞప్తి చేశారు. ఫ్లాట్ ఫామ్ పెంచాలని , టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. ఉబెర్ బస్ స్టేషన్ లో సీసీ వేయాలని కోరారు. భైంసా నుండి పోచ్రాద్ బస్సులు నడపాలన్నారు. సిర్పూర్ కాగజ్ నగర్ లో బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని రోడ్లతో సంబంధం లేకుండా మారుమూల ప్రాంతాల్లో బస్సులు నడపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ విజ్ఞప్తి చేశారు. మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల వారిగా మంత్రులు , ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులు స్వీకరించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని జిల్లాలో నియోజకవర్గాల వారిగా ఆర్టీసీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని బస్ స్టేషన్లలో టాయిలెట్స్ , మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. బస్ స్టేషన్ అభివృద్ధిలో ఆర్టీసీ తో ఎమ్మెల్యేలు తమ ఫండ్స్ ద్వారా సహకరించాలని కోరారు. కొత్త వస్తున్న బస్సులు ఎక్కడెక్కడ అవసరాలు ఉన్నాయి అక్కడకి పంపిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూటులో బస్సులు పంపించడానికి యాక్షన్ ప్రాన్స్ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులతో లు ఆర్టీసీ అధికారులు ప్రజాసంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఆ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ ఆదిలాబాద్ , ఖమ్మం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, డా,, సంజయ్ కుమార్, కౌశిక్ రెడ్డి , మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, విజయ రమణ రావు , వెడ్మా బొజ్జు,కోవా లక్ష్మీ ,అనిల్ జాదవ్ , రామారావు పటేల్ ,పాల్వాయి హరీష్ బాబు ,పాయం వెంకటేశ్వర్లు ,రాందాస్ నాయక్ , జారే ఆది నారాయణ, కోరం కనకయ్య , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడిలు , ఆర్ఎం లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వర్కవుట్ చేద్దాం ఫ్రెండ్స్..



'జిమ్‌కు ఎందుకు వెళ్తున్నావ్?' అని ఎవరినైనా అడిగితే.. స్లిమ్ కావడానికనో.. కండలు పెంచడానికనో సమాధానం చెప్పడం సహజం. కానీ, నేటి యంగ్ తరంగ్‌లు దీనికి భిన్నంగా స్పందిస్తున్నారు. 'ఫిట్‌నెస్ కోసం మాత్రమే కాదు.. ఫ్రెండ్‌షిప్ కోసం కూడా' అని చెబుతున్నారు. జిమ్‌లో కేవలం చెమటలు కక్కడమే కాదు.. చనువుగా మాటలూ కలుపుతున్నారు. కండలు మాత్రమే కాదు.. నెట్‌వర్క్ కనెక్షన్లూ పెంచుకుంటున్నారు. 'ఫిట్‌నెస్.. ఫ్లెక్సింగ్.. ఫ్రెండ్‌షిప్' అన్నీ కలిపి జెన్ జెడ్ కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నది. ఆన్‌లైన్‌లో దొరికే దోస్తుల కన్నా.. జిమ్‌లో కలిసే ఫ్రెండ్ బెస్ట్ అంటున్నది నేటి తరం. ఇతర వేదికల్లో పరిచయాలైన తర్వాత.. అభిరుచులు కలిస్తేనే స్నేహం చిగురించే అవకాశాలు ఉంటాయి. అదే జిమ్ స్నేహాల్లో అందరి కామన్ మంత్రం ఫిట్‌నెస్. అభిరుచులు కలిసిన తర్వాత అభిప్రాయాలు కలవడం ఎంతసేపు? అందుకే, జిమ్ స్నేహాలు ఇటీవల తెగ వర్కవుట్ అవుతున్నాయని పలు డేటింగ్ యాప్‌లు నిర్వహించిన సర్వేల్లో తేటతెల్లమైంది. డేటింగ్ యాప్ బంబుల్ 'ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్స్' కోసం క్యాంపెయిన్లు కూడా మొదలుపెట్టింది. వీళ్లు నిర్వహించిన ఓ సర్వేలో 52 శాతం జెన్ జెడ్ ఇండియన్ సింగిల్స్.. ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్‌కి ఆసక్తి చూపిస్తున్నారట. 95 శాతం మంది 'స్పోర్ట్స్ ఫస్ట్ డేట్'కి ఓటేస్తున్నారట. తమ పార్ట్‌నర్‌కు గానీ, ఫ్రెండ్‌కు గానీ ఆటలపై మోజు లేకుంటే 44 శాతం మంది వారితో 'డీల్ బ్రేకప్' అని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారట. అంతేకాదు, వర్కవుట్ ప్లేస్‌లో చిగురించిన స్నేహాలు.. యువతను జిమ్‌కు ఉత్సాహంగా వెళ్లడానికి ప్రేరణగా నిలుస్తున్నాయట కూడా!

**కొంగుముడి దాకా..:** 2024లో స్పోర్ట్ అండ్ ఫిట్‌నెస్ యాప్ స్ట్రావా విడుదల చేసిన 'ఇయర్ ఇన్ స్పోర్ట్' సర్వే రిపోర్ట్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 58 శాతం మంది తమకు జిమ్‌లో కొత్త ఫ్రెండ్ కలిశారని చెప్పుకొచ్చారు. ఇక ప్రతి ఐదుగురిలో ఒకరు తమ వర్కవుట్ ఫ్రెండ్‌తో డేటింగ్‌కు కూడా వెళ్తున్నారని వెల్లడైంది. వీరిలో కొందరు కొంగుముడి కూడా వేసుకుంటున్నారట. పబ్ కన్నా.. జిమ్‌లో ఏర్పడే పరిచయాలు సురక్షితం, సున్నితం, ఉపయోగకరం అని ఈ జనరేషన్ భావిస్తున్నది. జిమ్‌లు కొందరికి డేటింగ్‌కు దారి చూపితే.. మరికొందరికి కెరీర్ నెట్‌వర్కింగ్ హబ్‌లా పనిచేస్తున్నాయి. 'నా జిమ్ ఫ్రెండ్ ద్వారా నాకు జాబ్ రిఫరల్ కూడా వచ్చింది' అని హ్యాపీగా పోస్టు చేస్తున్నారు పలువురు.

**సోషల్ క్లబ్స్‌గా..:** నయా జనరేషన్ ఆసక్తులను గమనించిన జిమ్ నిర్వాహకులు తమ కార్యకలాపాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. కల్ట్‌ఫిట్ లాంటి సంస్థలు క్లయింట్స్ కోసం గ్రూప్ వర్కవుట్స్ అందిస్తున్నాయి. మైక్రో ఈవెంట్లు, జాయింట్ వర్కవుట్స్, టీమ్ బేస్డ్ ఇలా రకరకాల చాలెంజెస్‌ని పరిచయం చేస్తున్నాయి. జిమ్‌లో చిగురించిన బంధాలు మరింత బలపడటానికి క్రాఫ్ట్ వర్క్‌షాప్స్, మారథాన్స్, పెయింటింగ్ సెషన్స్ కూడా నిర్వహిస్తున్నాయి. అందుకే, జిమ్ అంటే తమకు రొటీన్ కాదనీ, రిలేషన్స్‌కు వారధి అని భావిస్తున్నారు యువతీయువకులు. కలిసి వర్కవుట్ అయినప్పుడు కలిసి జీవించేందుకు ఇష్టపడుతున్నారు. ట్రెడ్‌మిల్‌పై పరుగులు తీస్తూ.. ట్రెండింగ్‌గా పార్ట్‌నర్‌ని వెతుక్కుంటున్నారు. మొత్తంగా జిమ్ బాట పట్టినవారు ఫిట్‌నెస్ సంపాదించుకోవడంతో పాటు బోనస్‌గా సామాజికంగా యాక్టివ్‌గా మారుతున్నారు. ఈ ట్రెండ్‌ను మనమూ స్వాగతిద్దాం!!



# పెరుగు, బెల్లం మిశ్రమాన్ని రోజూ తినండి..

**ఎన్ని లాభాలు కలుగుతాయో మీరే చూస్తారు..**

వేసవి కాలంలో అందరూ చల్లని పదార్థాలను లేదా శరీరానికి చలువ చేసే ఆహారాలను తింటుంటారు. అలాంటి ఆహారాల్లో పెరుగు కూడా ఒకటి. ఈ కాలంలో పెరుగును చల్లగా తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇది మన శరీరంలోని వేడిని తగ్గించి వేసవి తాపం నుంచి ఉపశమనం అందిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా చూస్తుంది. ఎండ దెబ్బ నుంచి రక్షిస్తుంది. అయితే పెరుగులో కాస్త బెల్లం కలిపి ఇంకా ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల ఎన్నో పోషకాలను పొందవచ్చు. పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటే జీర్ణాశయంలో ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. పెరుగు ప్రో బయోటిక్ ఆహారాల జాబితాకు చెందుతుంది. ఇది జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**మహిళల సమస్యలకు..:** పెరుగు, బెల్లం మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తినడం వల్ల మహిళలకు నెలసరి సమయంలో వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అధిక రక్తస్రావం తగ్గుతుంది. ముఖ్యంగా కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. పెరుగు, బెల్లం మిశ్రమం ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. బరువు తగ్గాలని చూస్తున్న వారు పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటే మేలు జరుగుతుంది. ఈ మిశ్రమాన్ని తింటే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.


**నాడీ మండల వ్యవస్థకు..:** పెరుగులో బెల్లం కలిపి తింటే రక్త ప్రసరణ మెరుగు పడుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నాడీ సంబంధ వ్యాధులు తగ్గుతాయి. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఈ మిశ్రమాన్ని తీసుకుంటుంటే పురుషుల్లో లైంగిక పటుత్వం పెరుగుతుంది. శృంగారంలో యాక్టివ్‌గా పాల్గొంటారు. పెరుగు, బెల్లం మిశ్రమంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ కంట్రోల్ అవుతుంది. హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**ఎముకల ఆరోగ్యానికి..:** పెరుగు, బెల్లం మిశ్రమంలో క్యాల్షియం కూడా అధికంగానే ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా మారుస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే ఐరన్ దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. పెరుగు, బెల్లం మిశ్రమంలో పలు రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. ఈ మిశ్రమాన్ని రోజూ తింటే శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. ఇలా ఈ మిశ్రమాన్ని రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే కఫం సమస్య అధికంగా ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రాత్రి పూట తినకూడదు. మధ్యాహ్నం తినాలి.

# ఆత్మవిశ్వాసమే అసలైన ఆస్తి..

ఆత్మవిశ్వాసం.. పిల్లలకు తల్లిదండ్రులు అందించాల్సిన అసలైన ఆస్తి. కాన్ఫిడెంట్‌గా ఉంటేనే.. వారి భవిష్యత్తు బాగుంటుంది. ఎలాంటి సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ఎదుర్కొనే 'శక్తి' లభిస్తుంది. అయితే.. ఇది రాత్రికి రాత్రే వచ్చేదికాదనీ, తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే వారిపై వారికి నమ్మకాన్ని కలిగించాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. వారిపై మీరు చూపించే ప్రేమ, విశ్వాసం, ఇంట్లో వారిని ఎలా చూసుకుంటున్నారు? అనే విషయాలే.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయనీ అంటున్నారు. చిన్నచిన్న విషయాల్లో.. నిర్ణయాలను పిల్లలకే వదిలేయండి. బయటికి వెళ్లేటప్పుడు ఏ డ్రెస్ వేసుకోవాలో.. సాయంత్రం స్నాక్స్ కోసం ఏం సిద్ధం చేయాలో.. వారినే నిర్ణయించుకోమని చెప్పండి. వారి నిర్ణయాలను గౌరవించండి. ఈ చిన్న అలవాటే.. పిల్లల్లో సొంతంగా ఆలోచించుకొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. భవిష్యత్తులో పెద్దపెద్ద నిర్ణయాలు సులువుగా తీసుకోగలిగే విశ్వాసాన్ని అందిస్తుంది.

చదువుల్లోనైనా, ఆటల్లోనైనా ఫలితం ఎలా ఉన్నా.. పిల్లల ప్రయత్నాన్ని ప్రోత్సహించండి. వారు ఎంత శ్రమిస్తున్నారనేదే ముఖ్యమని గ్రహించండి. చదువుల్లో గ్రేడ్‌లు తెచ్చుకోవడం.. ఆటల్లో కప్పులు కొట్టేయడం మాత్రమే 'విజయం సాధించినట్టు' కాదన్న విషయం వారికి బాల్యం నుంచే నేర్పించండి. ఓడిపోయినప్పుడు కూడా వారి వెన్ను తట్టండి. ఇలాంటి ప్రోత్సాహం.. పిల్లల్లో సానుకూల మనస్తత్వాన్ని పెంచుతుంది. ఎలా గెలవాలో.. సమస్యలు ఎదురైతే ఎలా పోరాడాలో వారికి నేర్పుతుంది. ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండలేమనే విషయాన్ని కూడా పిల్లలకు బోధపరుస్తుంది. పిల్లలు స్కూల్‌నుంచి వచ్చినప్పుడో.. మీరు ఆఫీస్‌నుంచి ఇంటికి వెళ్లినప్పుడో.. మీ చిన్నారులను దగ్గరికి తీసుకొని కౌగిలించుకోండి. దీనివల్ల వారు భావోద్వేగానికి లోనవుతారు. వారిలో ఆక్సిటోసిన్ హార్మోన్ స్థాయులు పెరుగుతాయి. వారి మానసిక స్థితిని మెరుగుపర్చడంలో ఇది సాయపడుతుంది. దాంతో పిల్లలు మానసికంగా మరింత బలంగా తయారవుతారు. రోజూ ఇలా చేయడం వల్ల పిల్లల్లో జీవితం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఏ సందర్భంలోనైనా కుటుంబం తనకు అండగా ఉంటుందనే భరోసా కలుగుతుంది. ఇంట్లో



సురక్షితంగా ఉన్నామని భావించే పిల్లలు.. మరింత ఆత్మవిశ్వాసంతో పెరుగుతారు. ఒక చిన్న అభినందన.. వారికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. చిన్న విజయమైనా.. మీ ప్రశంస పెద్దగా ఉండాలి. అప్పుడే.. వారిలో పదేపదే ప్రశంసలు పొందాలనే భావన కలుగుతుంది. మీ అభినందనలే.. వారిలో సృజనాత్మకతను వెలికితీస్తాయి. కాబట్టి, మీ పిల్లలు చేసిన ప్రతి మంచి పనినీ అభినందించండి. దీంతో వారు మరిన్ని మంచి పనులు చేయడానికి ఉత్సాహం చూపుతారు. ఆ ప్రయత్నంలో ఓడినా – గెలిచినా అభినందిస్తే.. వారిని మరో ప్రయాణానికి ప్రేరేపిస్తుంది.

# గోటి అంచున వసంతం!



రుతువుల్లో అందమైనది ఏదీ అంటే వసంతానికే ఓట్లు ఎక్కువ పడతాయి. ఆకురాల్చడం నుంచి అందమైన పూలు పూసే దాకా సాగే కాలపు ముచ్చటైన మజిలీ ఇది. లేలేత చిగుళ్లు, చూడచక్కని వర్ణాల్లో విరబూసే విరిబాలలూ ఇక్కడి అలంకారాలు. అందుకే వసంతం అంటే ఓ ప్రత్యేకత. మనసును కట్టిపడేసే ఆ సౌందర్యాన్ని ఫ్యాషన్ మాత్రం ఎందుకు వదిలేస్తుంది! లేత తమలపాకులను పోలిన స్త్రీల గోటి మీద ప్రదర్శించి తన తరహాలో ప్రకృతికి కితాబునిస్తుంది. అందుకే ఇప్పుడు 'స్ప్రింగ్ నెయిల్స్' అన్నది కొత్త నెయిల్ ట్రెండ్. లేలేత వన్నెలు, చిన్ని చిన్ని పువ్వులు గోళ్ల మీద ముద్రించడమే ఇందులో ప్రత్యేకత. లేత గులాబీ, ఆకాశ నీలం, గోధుమ వన్నెలు ఎక్కువగా ఉంటాయిందులో. దాని మీద లేత చిగుళ్లు, చిట్టి పుష్పాలను నెయిల్ ఆర్ట్‌లాగా వేస్తారు. బంగారు రంగు ఫినిషింగ్‌లు, సన్నటి చుక్కల్లా మెరిసే కుందన్ల జోడింపులు అదనపు హంగులు. మొత్తానికి చూడగానే వసంతపు అందం గోటి మీద ప్రతిబింబించడమే ఈ ట్రెండ్ లక్ష్యం. మరి మీరూ వేస్తారా వసంతపు రంగులు?!


# రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి..! బరువు తగ్గండి ...!



లావుగా ఉండటం తప్పుకాదు. కాని తగ్గటం చాలా అవసరం ...! అందుకని ఉపవాసం ఉండకూడదు. కానీ ఒళ్ళు పెంచే ఆహారం తినకూడదని తెలుసుకోవాలి. శరీరపు బరువు సమతుల్యమై.. శరీరాకృతి పాడవకుండా ఉండాలంటే.. ఆత్మస్థైర్యం ఉండాలి. ఇంకా శరీరపు బరువును పెంచే నెయ్యి, తీపి పదార్థాలు, పెరుగు, మాంసం, వేపుడు కూరలు, నూనె వస్తువులు ముఖ్యంగా వేరుశెనగ నూనె, దుంపకూరలు, మినుముతో చేసే పదార్థాలు తినకండి. మజ్జిగ ఒళ్ళును పెరగనివ్వదు. రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి.

అన్నం తినేముందు కనీసం నాలుగు గంటలు రాగి చెంబులో నిల్వ ఉంచిన నీటిని కొంచెం తాగండి. రోజూ పరగడుపున అరగ్లాసు గోరు వెచ్చని నీళ్ళలో చెమ్చాన్నర తేనె కలుపుకుని తాగండి. మధ్యాహ్నం నిద్రపోకండి. రాత్రి అన్నం తిన్నాక కనీసం వంద అడుగులు నడిచి అప్పుడు పడుకోండి.. ఇంకా అర గంట సేపు నడవటం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ఇంకా మిరియాలు, అల్లం, పిప్పలి, ఉసిరికాయ, నిమ్మకాయ, జీలకర్ర, ధనియాలు, వాము.. వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. చారు, కూర, పుదీనా చట్నీలో వీటిని చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చునని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

# కలవర పెడుతున్న గుండె పోట్లు



మేడ్చల్ : యువత గుండెలయ తప్పుతోంది. మూడు పదుల వయస్సులోనే గుండెపో టు రావడం కలవరానికి గురిచేస్తోంది. మేడ్చల్ – మల్కాజిగిరిలో పదిహేను రోజుల వ్యవధిలోనే ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురవ్వడం.. వారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. యువకుల గుండెలు ఒక్కసారి ఆగిపోయి మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం మన జీవనశైలి, ఆహారపు అలవాట్లేనని, విపరీతమైన ఒత్తిడి (స్ట్రెస్), కలుషిత నీరు, గాలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం ప్రధాన కారణాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన యువకుడు (32) స్నేహితులతో కలిసి కీసర మండలం రాంపల్లి దాయరలోని త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడేందుకు (ఈ నెల 20న) వచ్చాడు. క్రికెట్ ఆడుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన అతని స్నేహితులు అంబులెన్స్ సహాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు.


సీఎంఆర్‌లో ఇద్దరు విద్యార్థులు..: మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 4న వినయ్ అనే విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. స్నేహితులతో కలిసి సాయంత్రం కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్నాడు. మైదానంలో ఫీల్డింగ్ చేస్తుండగా, గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకులాడు. స్నేహితులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 8న సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో సీఎస్‌ఈ సైబర్ సెక్యూరిటీ మూడో సంవత్సరం చదువుతున్న తుప్రాన్‌కు చెందిన సుమంత్‌కు కళాశాలకు రాగానే ఛాతిలో నొప్పి వచ్చింది. కళాశాల సిబ్బంది, స్నేహి తుల సహాయంతో సుమంత్‌ను సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు సుమంత్‌కు వైద్యం చేసి, బాగానే ఉందని వెళ్లవచ్చున పంచించారు. మళ్లీ మధ్యాహ్నం సుమంత్ కు తీవ్రమైన గుండె నోప్పి రావడంతో తిరిగి మళ్లీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

కారణాలివే..: చిన్న వయస్సులో గుండెపోటుకు గురవడానికి వైద్యులు అనేక కారణాలు చెబుతున్నారు. బీజీ బీజీ జీవితాల కారణంగా శారీరక శ్రమ కరువైపోతున్నది. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే శారీరకశ్రమ ఉండాలన్నది గ్రహించాలి. కరోనరీ హార్ట్ సంబంధిత మరణాల్లో దాదాపు 35 శాతం శారీరకశ్రమ లేకపోవడం వల్లనే అంచనా వేస్తున్నారు. చదువులో తీవ్రమైన ఒత్తిడికి (స్ట్రెస్) గురవడం. ఫాస్ట్ ఫుడ్, రక్తంలో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం. రెండు పదుల వయస్సులోనే మధుమేహం వ్యాధి వచ్చిన గుర్తించకపోవడం. శరీరం అధిక బరువు కారణంగా ధమనుల్లో కొవ్వు పదార్థాలు పేరుకుపోయేందుకు దారి తీస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులు దెబ్బతిన్నట్లయితే అది గుండెపోటుకు దారి తీయవచ్చు. తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉంటే, వారి పిల్లలకు చిన్నవయస్సులోనే గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. వాతావరణ కాలుష్యం కూడా గుండె జబ్బులకు దారితీస్తుంది. స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం వల్ల కూడా రావచ్చు. సిగరెట్ స్మోకింగ్ అలవాటు ఇటీవల ఎక్కువైంది. ఫ్యాషన్‌గా యువకులు సిగరెట్ స్మోకింగ్ చేస్తూ.. తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెట్టేసుకుంటున్నారు. సిగరెట్‌లో ఉండే రసాయనాలు రక్తాన్ని చిక్కగా చేస్తాయి. అలా చిక్కగా మారడం వలన సిరలు, దమనుల లోపలి గోడల్లో గడ్డలు ఏర్పడతాయి. సిరలు, ధమనుల్లో గడ్డకట్టి రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడం వలన గుండెపోటు ప్రమాదం పెరుగుతోంది.

ఇవి పాటిస్తే మేలు..: గుండె జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే జీవన శైలిని మార్చుకోవాలి. పనిలో ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. యోగా, ధ్యానం వంటి వాటి పై దృష్టి సారించాలి. శారీరక శ్రమ కలిగేలా రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్, వ్యాయామం చేయాలి. తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్నవారు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్ట్ చెకప్ తరచూ చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి, ఫాస్ట్ ఫుడ్, నూనె ఎక్కువగా వినియోగించిన ఆహారం తీసుకోరాదు.

వయస్సుతో సంబంధం లేదు.. డాక్టర్ శ్రీనివాస్, గుండె సంబంధిత వ్యాధి నిపుణులు: వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి, కంటి నిండా నిద్రలేకపోవడం వంటివే హార్ట్ ఎటాక్‌కు కారణం. మంచి ఆహారం, రోజుకు 8 గంటల నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం వంటివి చేస్తే హార్ట్ ఎటాక్, ఇతర రోగాలు కూడా దరిచేరవు.

# ఆత్మహత్యలను నివారించాలి



విద్యార్థుల్లో పరీక్షల గురించి ఆందోళన ప్రారంభం అవుతుంది. ఒకవైపు సిలబస్ పూర్తి చేసే హడావిడిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు వుంటారు. మరోవైపు వివిధ ప్రవేశ పరీక్షలకు నోటిఫికేషన్స్ విడుదల అవుతుంటాయి. ఇంకోవైపు వివిధ వివిధ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకునే పనిలో బిజీ అవుతాయి. ర్యాంకులు, మార్కుల ఒత్తిడిలో విద్యార్థులు నలిగి పోతుంటారు. ఫలితంగా కొందరు తీవ్ర నిరాశతో తామెందుకూ పనికి రామనే భావనకు గురవుతారు. ప్రాణాలు తీసుకునేంత బలహీనులుగా మారతారు. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యల వార్తలను ఎక్కువగా వినాల్సి వస్తోంది. పిల్లల్లో నిరాశ, నిస్పృహ ధోరణులు కనిపిస్తే- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తం కావాలి. వారికి తగిన ధైర్యాన్నివ్వాలి.

మారుతున్న కాలానికి తగ్గట్లుగా పరుగులు తీయలేక కొందరు, ఆర్థిక,వ్యక్తిగత, మానసిక.. ఇలా ఎన్నెన్నో కారణాలతో తనువు చాలిస్తున్నారు. అయితే ఏదైనా బతికి సాధించుకోవాలని గానీ, ఆత్మహత్యతో ఏ ప్రయోజనం లేకపోగా, వారి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతుంది.

పరిశోధకుల అధ్యయనం ప్రకారం.. ఎవరైతే తాను ఇక బతకడం వృథా అని పదే పదే ఆత్మహత్య గురించి మాట్లాడతారో, తమకు తామే హాని చేసుకోవడానికి యత్నిస్తారో వారిలో ఆత్మహత్య ఆలోచనలు ఉంటాయి. అటువంటి వారు ఎక్కువగా ఒంటరితనాన్ని ఇష్టపడతారు. ప్రతి సందర్భంలోనూ చికాకుపడటం, ఇతరు లతో మాట్లాడకుండా ఏకాకిగా ఉండడం చేస్తుంటారు. తాము చేసే ప్రతి పనిలోనూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిద్రలేమితో బాధ పడతారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఆ వ్యక్తులకు భరోసా అవసరమని మానసిక వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న దాని ప్రకారం 15 %-% 19 సంవత్సరాల వయస్సు గల యువతలో మరణానికి నాలుగో ప్రధాన కారణం ఆత్మహత్య అని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 7 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 77 శాతం కేసులు తక్కువ, మధ్య ఆదాయ దేశాల నుంచి ఉ ంటున్నాయి. ఇటువంటి ఆత్మహత్యలను నియంత్రించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. విద్యార్థులకు భరోసాగా ఉండటానికి విద్యాలయాలలో మానసిక నిపుణుల నియమించాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. కొన్ని సమయాల్లో కొన్ని కోర్సులకే డిమాండ్ ఉంటుంది. విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి వాటిని నేర్చుకుంటారు. తీరా నేర్చుకున్నాక వాటితో ఉపాధి అవకాశాలు రాకుండా పోతాయి. వివిధ కోర్సులకి సమాన అవకాశాలు ఉ ండేవిధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. విద్యార్థులతో తల్లి తండ్రులు కొంత సమయం గడపాలి. వారి సమస్యలని వినాలి. మార్కులే ప్రామాణికంగా కాకుండా వారికి ఇతర విషయాల్లో కూడా శిక్షణ ఇవ్వాలి. తల్లిదండులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ఉమ్మడిగా ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలి.

# కోడ్‌లతో మరింత ఖరీదు కానున్న ఫుడ్ డెలివరీ..

**లేబర్ కోడ్‌లతో ఫుడ్ డెలి'వర్రీ'!**

**కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లతో ఫుడ్ డెలివరీలు మరింత భారం**

**ఆర్డర్‌కు రూ.2-3 పెరిగే అవకాశం**




న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త లేబర్ కోడ్‌ల వల్ల ఫుడ్ డెలివరీ మరింత ఖరీదు కానుంది. గిగ్ వర్కర్ల కోసం కేంద్ర సంక్షేమ నిధికి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం మేరకు చెల్లించవలసి ఉంటుంది. దీంతో పర్-ఆర్డర్ ఖర్చులు రూ.2-3 వరకు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జేఎం ఫైనాన్షియల్ తెలిపిన వివరాల ప్రకారం, ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ క్యాటగిరీల్లోని కంపెనీలకు ప్రతి ఆర్డర్‌కు దాదాపు రూ.2.10 నుంచి రూ.2.50 వరకు అదనంగా భారం పడుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అంచనా ఆర్డర్ వాల్యూమ్స్‌కు దీనిని వర్తింపజేస్తే, ఎటర్నల్ (జొమాటో)కు దాదాపు రూ.430 కోట్లు, స్విగ్గీకి రూ.260 కోట్లు భారం పడుతుంది. ఈ భారాన్ని ఈ కంపెనీలు వినియోగదారులపైనే మోపుతాయి. ఇప్పటికే వినియోగదారులు ప్లాట్‌ఫాం ఫీజు, చిన్న ఆర్డర్ పెనాల్టీలు, పీక్ అవర్ సర్జెస్, సవరించిన జీఎస్టీ లెవీస్ వంటి భారాలను మోస్తున్నారు. ఇవి చాలవన్నట్లు ఇకపై ప్రతి ఆర్డర్‌కు రూ.2-3 మేరకు అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ విధంగా భారాలు పడటం రెండేళ్లలో ఇది నాలుగోసారి అవుతుంది.

అంతిమంగా వినియోగదారులపైనే భారం: ఎలారా సెక్యూరిటీస్ నిపుణుడు కరణ్ టౌరానీ మాట్లాడుతూ, గిగ్ వర్కర్స్ పేఅవుట్స్‌పై కాంట్రిబ్యూషన్స్ 5 శాతానికి చేరితే, రైడర్ వ్యయాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతాయన్నారు. ఎటర్నల్ (జొమాటో) డెలివరీ వ్యయంజీఎంవీలో 9.8 శాతం నుంచి 10.3 శాతానికి పెరుగుతుందన్నారు. స్విగ్గీ డెలివరీ వ్యయం 11.6 శాతం నుంచి 12 శాతానికి పైగా పెరుగుతుందని చెప్పారు. ఇప్పటికే నష్టాలతో సతమతమవుతున్న కంపెనీలకు స్వల్ప జీఎంవీ పెరుగుదల అయినా, ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఆర్డర్ వాల్యూస్ పెరిగినప్పటికీ, ధర పట్ల జాగ్రత్త వహించే కస్టమర్లు తక్కువ విలువ గల ఆర్డర్లను ఇవ్వడం మానుకోవచ్చునని నిపుణులు చెప్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్విగ్గీ రెవెన్యూ54.4 శాతం పెరిగిరూ.5,561కోట్లకు చేరింది, కానీ దాని నికర నష్టం రూ.1, 092 కోట్లుగా నమోదైంది. ఎటర్నల్‌కు వచ్చిన రెవెన్యూ రూ.13 ,590కోట్లు (183 శాతం పెరుగుదల), కాగా నికర లాభం రూ.65 కోట్లకు తగ్గింది. సాంఘిక భద్రత స్మృతి వల్ల గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య సంరక్షణ, పదవీ విరమణ ప్రయోజనాలు లభిస్తాయి. అయితే దీనికి సంబంధించిన ఆర్థిక భారాన్ని అంతిమంగా వినియోగదారులే భరించవలసి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

# జగన్ కు బ్యాడ్ టైమేనా?



**విజయవాడ,తెలంగాణ దిశ :**వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై నమోదయిన కేసుల విషయం చివరి దశకు చేరుకున్నట్లే కనిపిస్తుంది. ఇప్పుడు బీజేపీ కూడా జగన్ కు సాయం చేసే పరిస్థితుల్లో కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్ లో సొంతంగా అధికారంలో రాకపోయినా దానికి టీడీపీ, జనసేన అండగా ఉంది. అందుకే జగన్ ను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టే అవకాశాలున్నాయని అనేక మంది సీనియర్ రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ వల్ల బీజేపీకి ప్రత్యక్షంగా ప్రయోజనం ఉండదు. అలాగని ఇప్పటి వరకూ నష్టం లేదు. పరోక్షంగా జగన్ తమకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాడు. ఆ ఒక్క కారణంతోనే ఇన్నాళ్లు కేసుల విషయంలో చూసీ చూడనట్లు భారతీయ జనతా పార్టీ వ్యవహరించిందంటున్నారు. ఇప్పటి వరకూ ప్రధాని నరంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆశీస్సులు జగన్ కు పుష్కలంగా ఉన్నాయి.

అందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీకి ఇన్ని సార్లు వచ్చినా జగన్ ను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. జగన కూడా రాష్ట్రంలో తన ప్రత్యర్థి పార్టీలు బీజేపీతో జత కట్టినా బీజేపీని ఒక్క మాట అనడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఏం అవసరమొచ్చినా కమలం పక్కనే నిలబడుతున్నారు. కాంగ్రెస్ తనకు ప్రధాన శత్రువు కావడంతో బీజేపీకి మద్దతు ఇస్తుండవచ్చు. అందుకే ఏ బిల్లు విషయంలోనైనా,రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనైనా జగన్ నేరుగానే మద్దతిచ్చి మోదీ కి ఇష్టమైన వ్యక్తిగా మారాడు. అలాగే బీజేపీ విషయంలో ఒక్క విమర్శ కూడా చేయకుండా జాగ్రత్త పడుతున్నారు.

కానీ బీజేపీ తన వైఖరి మార్చుకోవడానికి అనేక కారణాలుంటాయి. బీజేపీకి కూడా దక్షిణాదిన అందులో ఆంధ్రప్రదేశ్ లో తమ బలం పెంచుకోవడం అవసరం. అది జగన్ వల్ల సాధ్యం కాదు. కూటమితో ఉంటే సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు. అధికారంలో ఒక రాష్ట్రంలో ఉ న్నామన్న సంతృప్తి పొందవచ్చు.

కానీ జగన్ వల్ల రాజకీయ ప్రయోజనం కొన్నింటికే పరిమిమై ఉ ంటుంది. ఈ విషయం గ్రహించిన బీజేపీ తన పంథాను మార్చుకోవచ్చన్న సూచనలు బలంగా అందుతున్నాయి. తమకు జగన్ కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమని భావిస్తే జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పవన్న సంకేతాలు ఇప్పటికే వస్తున్నాయి. జగన్ నేడు సీబీఐ కోర్టుకు కొన్నేళ్ల తర్వాత హాజరవ్వడాన్ని కూడా ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. అందుకే జగన్ కు రానున్నకాలం కష్టకాలమేనని ఖచ్చితంగా చెప్పొచ్చు.

# ఆరేండ్ల బాలుడిపై పెంపుడు కుక్క దాడి..

## తెగిపడిన చెవి.. యజమాని అరెస్ట్



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఓ బాలుడిపై పెంపుడు కుక్క దాడి చేసింది. ఆ పిల్లాడిని దానిని తప్పించేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ.. అతని చెవి తెగిపోయేదాక అది వదల్లేదు. ఆదివారం సాయంత్రం 5.38 గంటల సమయంలో ప్రేమ్‌నగర్ ప్రాంతంలోని విజయ్ ఎన్‌క్లేవ్‌లోని తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఇంతలో రాజేశ్ పాల్(50) అనే టైలర్‌కు చెందిన పిట్‌బుల్ జాతి కుక్క అకస్మాత్తుగా ఇంటి నుంచి బయటకు వచ్చింది. అక్కడే అక్కడున్న బాలుడిపై దాడి చేయబోయింది. పిల్లవాడు దాని బారి నుంచి తప్పించుకుని పరుగుతీస్తుండగా వెంటాడిన కుక్క అతనిపై ఎగబడింది. ఓ మహిళ దానిని ఆపడానికి ప్రయత్నించినప్పటికీ అది ఆగలేదు. అక్కడే ఉన్న మరో వ్యక్తి దానిని గమనించిన ఆ బాలుణ్ని రక్షించబోయారు. అయినప్పటికీ బాలుడిని వదలని శునకం.. అతని కుడి చెవి తెగిపోయేలా కరిచింది. కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుణ్ని వెంటనే స్థానికంగా ఉన్న రోహిణిలోని బీఎస్ఏ హాస్పిటల్‌కి, అక్కడి నుంచి సఫ్దార్‌జంగ్ దవాఖానకు తరలించారు.

ఇదంతా అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. కాగా, బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కుక్క యజమాని రాజేశ్‌పాల్‌పై భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద కేసుపెట్టిన పోలీసులు.. హత్యాయత్నం కింద అతడిని అరెస్టు చేశారు. రాజేశ్ పాల్ కుమారుడు సచిన్ పాల్.. సుమారు ఏడాదిన్నర క్రితం ఆ శునకాన్ని పెంచుకునేందుకు ఇంటికి తెచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం అతడు ఓ హత్యా నేరంపై జైలులో ఉన్నాడు. కాగా, కుక్క తన యజమాని చేతి నుంచి విడిపించుకుని ఈ దారుణానికి పాల్పడిందని బాలుడి తాత కామేశ్వర్ రాయ్ చెప్పారు. అతని తల వెనుక భాగంలో ఎనిమిది నుంచి పది కుక్కకాట్లు పడ్డాయన్నారు.

# చంద్రుడికి జన్మనిచ్చి మరణించిన థియా!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** భూమి, చంద్రుడి ఉద్భవానికి విశ్వంలో జరిగిన భారీ విస్ఫోటమే కారణమని ఇప్పటివరకూ చదువుకొన్నాం. 4.5 బిలియన్ సంవత్సరాల కిందట రెండు పెద్ద గ్రహాలు ప్రొటో ఎర్త్ (భూమి ఏర్పడటానికి ముందు గ్రహం), థియా పరస్పరం ఢీకొనడంతో ఇది జరిగినట్టు శాస్త్రవేత్తలు చెబుతూ వచ్చారు. అయితే, ఢీకొన్న అనంతరం చంద్రుడు, ప్రస్తుత భూమి ఏర్పడగా అంగారకుడి పరిమాణంలో ఉండే థియా ఏమైందన్న ప్రశ్నలకూ ఇంతవరకూ సమాధానం లేదు. అయితే, జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోలార్ సిస్టమ్ రిసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ షికాగో పరిశోధకులు తాజాగా దీనిపై కొత్త థియరీని తెరమీదకు తీసుకొచ్చారు. ప్రొటో ఎర్త్‌తో థియా ఢీకొన్న తర్వాత చంద్రుడు ఉద్భవించాడని, అనంతరం భూమిలోనే థియా కలిసిపోయిందని శాస్త్రవేత్తలు అంచనాకు వచ్చారు. భూమితో పాటు చంద్రుడి గర్భంలో దొరికిన ఐసోటోప్‌లను విశ్లేషించగా ఇది తెలిసివచ్చినట్టు పేర్కొన్నారు. అంటే, ఒకరకంగా చంద్రుడిని పుట్టించిన థియా.. భూమిలో కలిసిపోయి మరణించిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం ఈ థియరీపై మరింత లోతైన పరిశోధనలు చేయాల్సి ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు.

# కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్స్




కేంద్ర బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్స్‌గా మార్చింది. 2019లో వేతనకోడ్‌ను, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లకు పార్లమెంట్లో ఆమోదం పొందింది. అయినా, గత ఐదేళ్ల నుంచి వాటిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలలేదు. బీహార్‌లో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లేబర్ కోడ్స్ అమలు చేసే నాలుగు జీఓలను కేంద్ర కార్మిక శాఖా మంత్రి మాన్‌సూఖ్ మాండివ్య ప్రకటించారు. ఈ లేబర్‌కోడ్‌లు కార్పొరేట్లకు అనుకూలం. కార్మికవర్గానికి వ్యతిరేకం.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చింది. ప్రధాని మోడీ లేబర్‌కోడ్‌ల అమలు ఉత్తర్వులను సరళీక రణ విధానాలు అమల్లో భాగంగా అభివర్ణించారు. 'క్రోని కాపిటలిజం' కాలంలో కార్పొరేట్ల అత్యధిక లాభాలు గడించడానికి ప్రస్తుత చట్టాలు ఆటంకంగా ఉన్నాయి. అందుకోసమే ప్రస్తుత 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్‌లుగా కుదించి, అమల్లోకి తెచ్చారు. వాస్తవానికి పాలకవర్గం తమ దయా దాక్షిణ్యాలతో ఏ కార్మిక చట్టాన్ని రూపొందిం చలేదు. ప్రతి కార్మిక చట్టం వెనుక మహత్తరమైన పోరాటాలు ఉన్నాయి. అశేష త్యాగాల కారణంగా వచ్చిన కార్మిక చట్టాలను చెరుకు బండి రసాన్ని తీసినట్లు సారాన్ని పూర్తిగా తొలగించి, పిప్పినే మిగిల్చారు ఇప్పుడు. కార్మికవర్గం లేబర్‌కోడ్‌ల ద్వారా ఉన్న హక్కులను కోల్పోయింది. ఉన్న ఫళంగా పనిగంటలు పెంచితే కార్మిక వర్గం సహించి ఊరుకోదు. ఐక్యంగా పోరాడి తిరిగి చట్టాలను సాధించుకుం టుంది. రానున్న కాలంలో ప్రతిఘటన, పోరాటాలు అనివార్యం. లేబర్‌కోడ్‌ల పేరుతో నిర్వచనాలకే తిలోదకాలిచ్చారు. 'చట్టం' అనే పేరు లేకుండా కోడ్‌గా మార్చారు. ఇన్‌స్పెక్టర్ బదులుగా ఫెలిసిటేటర్ అని రూపాంతరం చేశారు. తనిఖీలు ఉండరాదనే కార్పొరేట్‌ల కోర్కెను ఈ విధంగా తీర్చారు. తనిఖీ లేకుండా ఏ చట్టమైనా అమలు జరుగుతుందా? కార్మిక చట్టాల్లోని జీతం, డీఏ, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ వగైరా ఏ ఒక్క అంశం అమలు జరగకపోయినా- అధికారులు తనిఖీ చేయాలి. ఇది ఇప్పటివరకూ చట్టాలు చేసే మార్గదర్శనం. కాని ఇకముందు యూనియన్లు ఫిర్యాదు చేసినా, కార్మికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి తనిఖీలూ ఉండవు. ఇప్పటివరకూ చట్టాలు అమలు చేయకపోతే యజమానికి జైలుశిక్షలు విధించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇకముందు జరిమానాలే గాని జైలు శిక్షలుండవు. అంటే ఏ యజమానికి ఏ భయమూ ఉండదు. ఫలితంగా లేబర్‌కోడ్‌లో ఉన్న అంశాలు కూడా అమలు కావు. ఇప్పటి వరకూ ఉన్న 'ట్రైనీ' అనే పదం కూడా మాయమైంది. దానికి బదులు ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఎన్ని సంవత్సరాలైనా పర్మినెంట్ చేయకుండా పని చేయించుకునే విధానం అమల్లోకి వస్తుంది. పేరు ఏది పెట్టినా కార్మికులను జీవితమంతా పర్మినెంట్ చేయకుండా పని చేయించడమే లేబర్‌కోడ్స్ సారాంశం.

ఇప్పటికే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి అనేక తరగతులను కార్మికులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. సామాజిక భద్రత, వృత్తిపర భద్రత కోడ్‌ల పేరుతో కార్మికులందరికీ భద్రత కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం పచ్చి మోసం. బిల్డింగ్, మైన్స్, బీడీ కార్మికులు, జర్నలిస్టులతో సహా ఇన్నేళ్లూ పోరాడి సాధించుకున్న భద్రతను ఈ కోడ్స్ కారణంగా కోల్పోతున్నారు. 1996లో వచ్చిన బిల్డింగ్ వర్కర్స్ చట్టం ప్రకారం%ొ% భవనాలు, ఇతర నిర్మాణాల యజమానుల నుంచి వసూలు చేసిన సెస్‌ను ఆ రంగాల కార్మికులకు ఖర్చు పెట్టాలి. కానీ, ఇప్పుడు వృత్తిపరమైన రంగాల చట్టాలన్నీ రద్దయిపోతాయి. యజమానుల నుంచి సెస్ వసూలు చేయకుండా వారికి భద్రత ఉ ండదు. దీనివల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుంది. కార్మికులు సమ్మె చేయకుండా అన్ని విధాల ప్రభుత్వానికి, యాజమాన్యాలకు పారిశ్రామిక సంబంధాల కోడ్ అవకాశం కల్పిస్తుంది. సమ్మె కార్మికుల హక్కు. కార్మికులు పోరాడకుండా ఏ హక్కులూ సాధించుకోలేం. కానీ పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో పేర్కొన్న దాని ప్రకారం%ొ% కార్మికులు సమ్మె చేస్తే - ఒక రోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుంది. యూనియన్ నాయకులను జైల్లో పెట్టవచ్చు. యూనియన్ గుర్తింపును, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయవచ్చు. అంటే రానున్న కాలంలో పోరాటాలను అణచాలనే పాలకవర్గాల కుట్రలో భాగమే లేబర్‌కోడ్స్ అమలు. "అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న" అన్నట్లు కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు అమల్లోకి రాకముందే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్మిక చట్టాలను అమలు చేయడం లేదు. దీనినే దేశమంతా 'ఈజ్ ఆఫ్ డూయింగ్' బదులు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ వ్యతిరేకంగా ఉన్నాయనేది స్పష్టం. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు చేస్తూ, 2025 నవంబర్ 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా, ముఖ్య కేంద్రాల్లో నిరసన తెలియజేయాలని 11 కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

# మతం మారినా మారని వివక్ష




గౌరవ సుప్రీంకోర్టు దళిత క్రిస్టియన్ల విషయంలో ఇచ్చిన తీర్పు చాలా దురదృష్టకరం. ఈ తీర్పు రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి గొప్ప విలువలకు తూట్లు పొడిచింది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉండడమే కాకుండా, కోట్లాది మంది దళిత క్రిస్టియన్ల జీవితాలను ఈ తీర్పు ప్రమాదంలో పడేయబోతున్నది. భారత ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అప్పీల్‌కు వెళ్లి ఈ రాజ్యాంగ వ్యతిరేక తీర్పును రద్దు చేయించాలి. 1985 జూలై 17న జరిగిన కారంచేడు హత్యాకాండ దేశంలోనే సంచలనం సృష్టించింది. దళిత (మాదిగ) వర్గానికి చెందిన తాగునీటి చెరువులో ఆధిపత్య (కమ్మ) సామాజికవర్గానికి చెందిన యువకులు పశువులకు స్నానం చేయించారు. ఇదేంటని ప్రశ్నించినందుకు, మాపైనే ఎదురుతిరిగి మాట్లాడుతారా అనే అహంకారంతో దాడికి పాల్పడ్డారు. ఆరుగురు మాదిగలను హత్య చేశారు. ముగ్గురు మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ప్రత్యక్ష సాక్షిని విషాహారం పెట్టి చంపారు. ఈ హత్యాకాండనే దేశంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం రావడానికి పునాది అయింది. అయితే ఈ మారణకాండలో మృతులు తెల్లా మోషే, తెల్లా ముత్తయ్య, తెల్లా యెహోషువా, సాక్షి దుడ్డు అలీసమ్మ క్రైస్తవ మతాన్నే ఆచరించారు. వారిని చంపినందుకే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టం ప్రకారమే సుప్రీంకోర్టు నుంచి కింది కోర్టుల వరకు తీర్పులు వెలువరించాయి. 1991 ఆగస్టు 6న చుండూరులో జరిగిన హత్యాకాండలో 8 మంది దళిత (మాల) యువకులు మరణించారు. అందులో జాలాది ఇమ్మాన్యుయేల్, జాలాది ఇసాకు, సంకురు సామ్సన్ కూడా క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నవారే. ఈ కేసులో 2007లో చుండూరులోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ప్రత్యేక కోర్టు 21 మందికి జీవిత ఖైదు, 35 మందికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది.

అనంతరం 2014లో హైకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును కొట్టివేస్తే, ఇప్పటికీ ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లోనే ఉన్నది. ఈ కేసు సుప్రీం కోర్టులో ఇంకా ఎందుకు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నది అని ఊహించడం అంత కష్టమేమీ కాదు. సుప్రీంకోర్టు అదే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 'చింతాడ ఆనంద్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' కేసులో గతంలో ఇచ్చిన తీర్పును, చట్టాలను ఎలా విస్మరించింది? ఆనాడు బాధితులు అనుసరిస్తున్న మతంతో సంబంధం లేకుండా, కేవలం కులం ఆధారంగానే కేసులు నమోదు చేసి తీర్పులు ఇచ్చి, ఇప్పుడు మతానికి రిజర్వేషన్లు, రక్షణ చట్టాలను ఎలా అంటకడుతారు?

కులం వేరు-మతం వేరు: భారతీయ సమాజంలో కుల వివక్ష ఒక లోతైన సామాజిక వ్యాధి. ఇది కేవలం మతపరమైన నమ్మకం కాదు, పుట్టుకతో వచ్చే ఒక సామాజిక ముద్ర. క్రైస్తవ మతంలోకి మారినంత మాత్రాన ఒక వ్యక్తి ఎదుర్కొనే కులపరమైన వేధింపులు, సామాజిక వెలివేతలు మటుమాయం అవుతాయా? అస్పృశ్యత అనే కళంకం బాప్టిజం నీటితో కడిగివేసినట్టు అవుతుందా?

శాసన చరిత్ర -- సామాజిక సత్యం: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వుల్లోని క్లాజ్ 3 చరిత్రను పరిశీలించడం చాలా అవసరం. 1950లో ఈ ఉత్తర్వును మొదటిసారి అమలు చేసినప్పుడు, క్లాజ్ 3 ప్రకారం కేవలం హిందూ మతాన్ని అనుసరించే వారికి మాత్రమే ఎస్సీ హోదా పరిమితమై ఉండేది. ఆ తర్వాత 1956లో దీనిని సవరించి సిక్కు మతస్థులను చేర్చారు. 1990లో మరోసారి సవరణ చేస్తూ బౌద్ధ మతస్థులకు కూడా ఈ హోదాను వర్తింపజేశారు. అయితే, ఇన్ని దశాబ్దాల్లో ఎన్ని సవరణలు జరిగినప్పటికీ క్రైస్తవ మతాన్ని మాత్రం ఈ ఉత్తర్వుల్లో చేర్చకపోవడం గమనార్హం. ఇదే ప్రాతిపదికన, క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం వర్తించదని కోర్టు స్పష్టంచేసింది. కానీ ఇక్కడ ఒక సామాజిక సత్యం దాగి ఉన్నది. కులం మతపరమైన గుర్తింపు కాదు, అది ఒక వారసత్వ సామాజిక నిర్మాణం. ఒక వ్యక్తి తన ఆత్మగౌరవం కోసం మతం మారవచ్చు, కానీ సమాజం అతడిని చూసే కోణం మారడం లేదు. ఈ కేసులో నిందితులు బాధితుడిని కేవలం క్రైస్తవుడిగా చూసి దాడి చేయలేదు; వారు అతడిని ఒక నిర్దిష్ట కులానికి (మాదిగ) చెందిన వ్యక్తిగా గుర్తించి, కులపరమైన దూషణలతో దాడికి పాల్పడ్డారు. అంటే, హింసకు ప్రేరణ కుల వివక్షే అయినప్పుడు, బాధితుడి వ్యక్తిగత విశ్వాసం రక్షణకు అడ్డుగోడగా మారడం ఎంతవరకు న్యాయం? వేధింపులకు గురిచేసేవారికి స్పష్టంగా కనిపిస్తున్న కులం, రక్షించాల్సిన చట్టానికి ఎందుకు కనిపించడం లేదు?

సాక్ష్యాధారాల్లో వైరుధ్యం: సుప్రీంకోర్టు తీర్పులో న్యాయస్థానం అనుసరించిన తీరు అనేక విరుద్ధమైన అంశాలతో కూడి ఉన్నది. ఒక వ్యక్తి మళ్లీ హిందూ మతంలోకి మారినప్పుడు, ఆ మార్పు 'నిజాయితీతో కూడుకున్నదా' అని నిర్ధారించడానికి కఠినమైన సాక్ష్యాధారాలను కోర్టు కోరుతున్నది. కానీ, ఒక దళితుడు క్రైస్తవ మతంలోకి మారినప్పుడు మాత్రం ఎటువంటి లోతైన విచారణ లేదా అనుభవపూర్వక ఆధారాలు లేకుండానే అతడి కుల హోదా రద్దయిపోయిందని భావిస్తున్నది. ఇది ఒకరకమైన అనుభవపూర్వక అంధత్వం. మతం మారిన వెంటనే శతాబ్దాల నాటి సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం మాయమైపోతుందని భావించడం వాస్తవ దూరమైన ఆలోచన. అంతేకాకుండా, బాధితుడి వద్ద చట్టబద్ధంగా పొందిన కుల ధృవీకరణ పత్రం ఉన్నప్పటికీ, అది అతడికి ఎటువంటి ప్రయోజనాన్ని చేకూర్చదని కోర్టు పేర్కొనడం ఆశ్చర్యకరం.

ఆర్టికల్ 17 విస్మరణ: సుప్రీంకోర్టు తీర్పులోని అత్యంత విచారకరమైన అంశంఏమిటంటే.. భారత రాజ్యాంగంలోని 17వఅధికరణం గురించి మౌనం వహించడం. అస్పృశ్యత నివారణను ఆర్టికల్ 17 ఎటువంటి షరతులు లేకుండా ప్రకటిస్తుంది. బాధితుడి మతం ఏదైనా సరే, ఏ రూపంలోనైనా అస్పృశ్యతను పాటించడం నేరమని ఇది స్పష్టం చేస్తున్నది. అస్పృశ్యత కేవలం హిందువులకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. దళిత క్రైస్తవులు నేటికీ గ్రామాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారనిజస్టిస్ రంగనాథ్‌మిశ్రా కమిషన్‌వంటినివేదికలు నిరూపించాయి.

సంక్షేమం వేరు.. రక్షణ వేరు: రిజర్వేషన్లు లేదా ఇతర సంక్షేమ ఫలాలు పొందేందుకు అర్హతను నిర్ణయించే 1950 ఉత్తర్వులను, ఒక నేరానికి సంబంధించిన రక్షణ కల్పించే ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి ముడిపెట్టడం తర్కబద్ధం కాదు. రిజర్వేషన్లు సామాజిక అభివృద్ధికి సంబంధించినవి. కానీ అట్రాసిటీ చట్టం ప్రాణ రక్షణకు, ఆత్మగౌరవానికి సంబంధించినది. చట్టం రక్షణ కవచం బాధితుడి మతాన్ని బట్టి కాకుండా, నేరస్థుడి ఉద్దేశాన్ని బట్టి నిర్ణయించాలి. హిందూ దళితుడిపై దాడి జరిగితే అట్రాసిటీ కేసు నమోదై, క్రైస్తవ దళితుడిపై దాడి జరిగితే సామాన్య నేరంగా పరిగణించడం సమానత్వానికే విరుద్ధం.

న్యాయాన్ని నీరుగార్చిన కొట్టివేత: అట్రాసిటీ చట్టం సాంకేతిక కారణాల వల్ల వర్తించదు అనుకున్నా, కనీసం భారత శిక్షాస్మృతి (ఐపీసీ) కింద నమోదైన కేసులనైనా విచారించాల్సింది. బాధితుడికి గాయాలు జరిగినట్టు వైద్య ధృవీకరణ పత్రాలు ఉన్నా, సాక్షుల వాంగ్మూలాలు ఉన్నా.. విచారణకు ముందే కేసును కొట్టివేయడం విస్మయానికి గురిచేస్తున్నది. స్టేట్ ఆఫ్ హర్యానా వర్సెస్ భజన్ లాల్ (1992) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, ఒక కేసు విచారణకు అర్హత లేనంత బలహీనంగా ఉన్నప్పుడు మాత్రమే కొట్టివేయాలి. కానీ ఈ కేసులో తగిన ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, చిన్న చిన్న వైరుధ్యాలను సాకుగా చూపి నీరుగార్చడం వల్ల బాధితుడికి న్యాయం పొందే ప్రాథమిక హక్కును నిరాకరించినట్టే. చట్టం అందరికీ సమానంగా ఉండాలి. ఒక వ్యక్తి తన విశ్వాసాలను మార్చుకున్నందుకు, అతడు ఎదుర్కొనే కుల వివక్షకు చట్టపరమైన రక్షణ లేకుండా పోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు. రాజ్యాంగంలోని 17వ అధికరణం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపై ఉన్నది.

కులం ఒక సామాజిక కట్టుబాటు; అది మతం మారినంత మాత్రాన చనిపోదు. ఒకవైపు సాక్ష్యాలను కోరుతూ, మరోవైపు ఉన్న సాక్ష్యాలను తిరస్కరిస్తూ కోర్టు తీసుకున్న ఈ నిర్ణయం దళిత క్రైస్తవులను సామాజికంగా ఒంటరిని చేసే ప్రమాదం ఉన్నది. కులం అనే మాయని మచ్చ ఉన్నంత వరకు, దానికి వ్యతిరేకంగా ఉన్న చట్టం మతం పేరుతో వెనక్కి తగ్గకూడదు. ఈ సమస్య పరిష్కారానికి రాజ్యాంగ ధర్మాసనం ద్వారా సమీక్ష జరగడం లేదా పార్లమెంట్ తగిన సవరణలు చేయడం తక్షణావశ్యం. రాజ్యాంగం లోపల ఉన్న రక్షణలు బాధితుడికి భరోసానివ్వాలి కానీ, సాంకేతికతలతో నేరస్థుడికి దారి చూపకూడదు. అప్పుడే రాజ్యాంగం పట్ల సామాన్యుడికి నమ్మకం, గౌరవం మిగులుతాయి. న్యాయం కేవలం అక్షరాల్లోనే కాదు, ఆచరణలో కూడా అందరికీ సమానంగా అందాలి. ఆ దిశగా అడుగులు పడటమే నేటి సామాజిక అవశ్యకత.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 వ్యక్తి తమకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను ఇచ్చిందని సుప్రీంకోర్టుకు తెలియదా? క్రైస్తవంలోకి మారి చర్చికి వెళ్లినంత మాత్రాన వివక్ష ఉండదు, అవమానం ఉండదు, అంటరానితనం ఉండదు అని నిరూపించే శాస్త్రీయబద్ధమైన పరిశోధనలు లేదా కొలమానాలు ఏవైనా సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకున్నదా? క్రైస్తవ మతం పుచ్చుకున్నంత మాత్రాన అడ్డగూడూర్‌లో మాల సామాజిక వర్గానికి చెందిన మరియమ్మ మీద లాకప్‌లో చిత్రహింసలు ఆగాయా? నిజానికి అ కేసులో ఫిర్యాదుదారు చర్చి ఫాదర్ బాలశౌరి దళితేతరుడు. ఇప్పటికీ ఎంతో మంది ఆధిపత్య వర్గాలకు చెందిన వారు తమ కులాలకు చెందిన పేర్లనే నేటికీ వాడుకొంటున్నారు. మతం మారి నా వెంటనే కులం, కుల వివక్ష పోవు అని భారతదేశంలో ఎన్నో ఘటనలు నిరూపిస్తున్నాయి.

కమిటీల రిపోర్టులు ఏం చెప్తున్నాయి?: భారత ప్రభుత్వం 2005లో ఏర్పాటు చేసిన సచార్ కమిటీ, తన నివేదికలో దళితులు మతం మారినా వారి సామాజిక స్థితి, అంటరానితనం, వివక్ష మారలేదని స్పష్టం చేసింది. అనంతరం 2007లో రంగనాథ్ మిశ్రా కమిషన్ తమ నివేదికలో దళితులు క్రైస్తవ లేదా ఇస్లాం మతానికి మారినా, వారిపై ఉండే వివక్ష, అవమానం మాత్రం మారలేదని, సామాజిక స్థితి మెరుగుపడలేదని స్పష్టంచేసింది. మతం మారిన దళితులకు ఎస్సీ హోదానే ఇవ్వాలని తమ నివేదికలో పొందుపరిచింది. కానీ ఆనాటి యూపీఏ ప్రభుత్వం కమిటీ నివేదికను అమలుపరచలేదు. ఇదే విషయంపై అధ్యయనం కోసం 2022లో ఎన్డీఏ ప్రభుత్వం జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసింది. కానీ ఆ కమిషన్ నేటికీ నివేదిక సమర్పించలేదు.

తక్షణ కర్తవ్యం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిటీ నివేదికను వెంటనే తీసుకోవాలి. కమిటీ సిఫారసులను బహిర్గతపరచాలి. సుప్రీంకోర్టుకు దళిత క్రైస్తవుల వాస్తవ పరిస్థితులను నివేదించాలి. సుప్రీంతీర్పును సవాల్ చేస్తూ కౌంటర్ దాఖలు చేయాలి. తీర్పు అమలు కాకుండా చట్టబద్ధంగా నిలువరించాలి. ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచకుండా సూచనలు, ఆదేశాలు జారీ చేయాలి. అంతవరకు యథాతథ స్థితిని కొనసాగించాలి.

# రాజధానిగా రాజముద్ర..


**అమరావతి,తెలంగాణ దిశ :** వేల కోట్లతో నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం. మిషన్ మోడ్‌లో పనులు. పెద్ద పెద్ద టవర్లు. ఇంటర్నేషనల్ లెవల్ స్టాండర్డ్స్‌తో నిర్మాణాలు. ఇలా ఏడాదిన్నరగా అమరావతి అన్‌స్టాపబుల్ అన్నట్లుగా దూసుకెళ్తోంది. గతానికి మించి కొత్త కలతో కళకళలాడటమే కాదు.. సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. కానీ ఒక్కటే బాకీ ఉంది. అదే రాజధాని రాజముద్ర. రాజముద్ర పడితే ఇక నో ప్రాబ్లమ్. ఇటు రైతులు..అటు సీఎం చంద్రబాబు అందరి మదిలో ఉన్నమాట ఇది. ఇందుకోసం కూటమి సర్కార్ చేసిన ప్రయత్నాలన్నీ ఫైనల్ స్టేజ్‌కు చేరి..అమరావతికి హోదా దక్కేందుకు రూట్ క్లియర్ అవుతోంది. కూటమి సర్కార్ ప్రెజర్..కేంద్ర ప్రభుత్వ చర్యలు అన్నట్లుగా డెవలప్ మెంట్ నడిచింది. కానీ సడెన్‌గా ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం అంటూ నోటిఫికేషన్ రిలీజ్ అయింది. ఈ నెల 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశమై..ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని గుర్తించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయనుంది. ఆ తీర్మానానికి గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే నోటిఫికేషన్ జారీ కానుంది. దాన్ని కేంద్రానికి పంపించనుంది ఏపీ సర్కార్. ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే విభజన చట్ట సవరణ బిల్లు పెట్టి..అమరావతిని ఏపీ రాజధానిగా బిల్ పాస్ చేయనున్నారు.అయితే రాజధానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపితే చాలు అంటున్నారు. కానీ ఫ్యూచర్‌లో సమస్యలు రాకుండా ఉండాలంటే అసెంబ్లీలో తీర్మానం చేయడమే బెటర్ అని భావిస్తున్నారట. పీఎంవో నుంచి అందిన సూచనల ప్రకారమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి తీర్మానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారట. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం ఇప్పటికే సానుకూలంగా స్పందించింది. కేంద్రం డౌట్స్ అన్నింటిని క్లారిఫై చేసిన ఏపీ ప్రభుత్వం పూర్తి సమాచారాన్ని అందజేసింది. ఈ క్రమంలోనే ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాష్ట్ర విభజన చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం..ఏపీ అసెంబ్లీ నుంచి ప్రత్యేక తీర్మానం కోరినట్లు తెలుస్తోంది.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే కొత్త రాజధానిని ఎంచుకోవాలి. 2014 జూన్ 2ను అపాయింటెడ్ డేగా నిర్ణయిస్తూ, రెండు రాష్ట్రాలకు పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే నిర్దేశిత పదేళ్ల కాలం పూర్తయింది. ఈలోపే ఏపీ ప్రభుత్వం కొత్త రాజధాని ఏర్పాటు చేసుకుంది. అయితే దానికి చట్టబద్ధత లేదని అపోహలున్నాయి. 2015 ఏప్రిల్ 23నే అప్పటి ప్రభుత్వం రాజధాని అమరావతి అంటూ జీవో 97ను జారీ చేసింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరిట హైడ్రామా నడిచింది. 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక..మళ్లీ రాజధాని పనులు స్పీడ్ అయ్యాయి. ఈ క్రమంలోనే రాజధాని రైతుల నుంచి ప్రధాన డిమాండ్ ఒకటి వినిపిస్తూ వస్తోంది. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే..ఫ్యూచర్‌కు ఢోకా ఉండదని వాళ్లు సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేశారు. భవిష్యత్‌లో ఎవరు అధికారంలో ఉన్నా..రాజధానిని మార్చడానికి వీల్లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే అమరావతిని రాజధానిగా గుర్తించే చట్టసవరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదింపజేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.మొన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలోనే ఏపీ రాజధాని బిల్లును ఆమోదిస్తారని ప్రచారం జరిగింది. కానీ అసెంబ్లీ తీర్మానం లేకుండా బిల్లును ఆమోదించలేమని కేంద్ర న్యాయశాఖ చెప్పడంతో..లాస్ట్ మినిట్‌లో పక్కన పెట్టినట్లుగా టాక్ నడుస్తోంది. 28న అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపిన తర్వాత..ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ భేటీలో బిల్లును ఆమోదించి అదే రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఆ తర్వాత రాష్ట్రపతి రాజముద్రతో గెజిట్ రిలీజ్ చేస్తారని అంటున్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వద్దు..
## బట్ట సంచులే ముద్దు

**సంగారెడ్డి,తెలంగాణ దిశ :** పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకు రావాలని, అందుకోసం వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను వాడకుండా బట్ట సంచులను వాడుకోవాలని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ సూచించారు. ఉదయం ఆయన తన సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు కొన్ని వార్డులను సందర్శించారు. పారిశుద్ధ్యం నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకరించి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని సూచించారు. ఇకపోతే ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేస్తే వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# ఫ్యాన్ కింద ఉక్కపోతేనా




**కడప,తెలంగాణ దిశ :** నియోజకవర్గాల పునర్విభజనతో వైసీపీ వైపు చూసే నేతల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయన్నఅంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న 175 నియోజకవర్గాల నుంచి 263కు, ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరగనున్నాయి. అంటే ప్రస్తుతమున్న నేతలకు తోడు అదనంగా మరో వంద మందికి పైగా నేతలకు వచ్చే ఎన్నికలలో టిక్కెట్లు దక్కనున్నాయి. అదే వైసీపీలో ఉంటే అడ్వాంటేజీ ఉంటుందన్న భావన నేతల్లో కలుగుతుంది. కూటమి కంటే ఫ్యాన్ పార్టీలో ఉంటేనే బెటర్ అని ఎక్కువ మంది సీట్లు ఆశిస్తున్న నేతలు భావిస్తున్నారు.కూటమిలో ఉండి టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తే సీటు వస్తుందో లేదో చివరకు వరకూ టెన్షన్ తప్పదు. ఎందుకంటే కూటమిలో టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీలుండటంతో ఎవరికి ఏ స్థానం కేటాయిస్తారన్నది ఎవరికీ అంతుచిక్కదు. చివరి నిమిషంలో కూటమిలో ఏ పార్టీ అయినా పట్టుబడితే తాము ఆశించిన సీటు చేజారి పోయే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ అనేక మంది సీనియర్ నేతలకు, ఆశావహులకు టిక్కెట్లు దక్కకపోవడానికి కూటమిలో పొత్తుల వల్లనేనని చాలామంది రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో కష్టపడ్డ తమకు గుర్తింపు రావాలంటే వైసీపీ అయితే బెటర్ అని భావించే అవకాశముంది.అదే వైసీపీలో చేరితే తాము గట్టిగా ప్రయత్నిస్తే టిక్కెట్ దక్కడం సులువవుతుందని ఎక్కువ మంది నేతలు నమ్ముతున్నారు. 263 శాసనసభ, 38 పార్లమెంటు నియోజకవర్గాల్లో పాత నేతలు కొందరు వెళ్లినా కొత్త వారికి అవకాశాలు వైసీపీలోనే దక్కుతాయని అప్ కమింగ్ లీడర్లు భావిస్తున్నారు. వైసీపీ సింగిల్ గా పోటీ చేస్తున్నందున పోటీ తక్కువగా ఉంటుందన్న ఆలోచనలో ఉన్నారు. అందుకే ఇప్పుడు రానున్న కాలంలో ఎక్కువ మంది నేతలు వైసీపీ వైపు వచ్చే అవకాశముందన్న అంచనాలు కూడా వినపడుతున్నాయి. టిక్కెట్ దక్కాలంటే ఫ్యాన్ కంటే పదిలం మరేది ఉండదన్న భావన ఎక్కువ మందిలో కలుగుతుంది. మరి రానున్న కాలంలో వైసీపీలో చేరికలు ఏ మాత్రం ఉంటాయన్నది చూడాలి.

## విషాదంలోనూ మానవత్వం..

## అవయవదానంతో ఎనిమిది మందికి పునర్జన్మ..!



గుండాల,తెలంగాణ దిశ :గుండాల మండలంలోని మాసాన్ పల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. విషాదంలో ఉన్నప్పటికీ ఆ కుటుంబం మానవత్వం చాటుకుంది. బ్రెయిన్ డెడ్ అయిన బత్తిని హరీష్ గౌడ్ (24)అవయవాలను దానం చేసి ఎనిమిది మందికి కొత్త జీవితం ప్రసాదించిన కుటుంబం ఆదర్శంగా నిలిచింది. హరీష్ గౌడ్ హైదరాబాదులో ఉప్పల్ లో నివసిస్తు మెట్రో షాపింగ్ మాల్ లో పని చేస్తున్నాడు. గత నాలుగు రోజుల క్రితం బైకు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మలక్ పేట యశోద హాస్పిటల్ తరలించారు. ఐదు రోజులుగా ఐసీయూలో వెంటిలేటర్ పై వైద్యులు చికిత్స అందించినప్పటికీ బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వైద్యులు, జీవన్ దాన్ సంస్థ ప్రతినిధులు తల్లి తండ్రి బత్తిని ఎల్లయ్య, మహేశ్వరికి అవయవ దానం గురించి అవగాహన కల్పించారు. అవయవాలను దానం చేయడానికి అంగీకరించడంతో వైద్యులు అవయవాలను సేకరించి అవసరమైన రోగులకు మార్పిడి చేశారు. హరీష్ గౌడ్ అవయవాలు పలువురికి ప్రాణదారంగా మారాయి. కన్నీరు మున్నీరైన గ్రామం ఒకేఒక్క కొడుకు చేతికందిన కొడుకు మరణించాడని తల్లితండ్రుల శోకసంద్రంతో వారు ఏడ్చే తీరును గ్రామమంతా కన్నీరు పెట్టించాయి. విషాదాన్ని తట్టుకుని సమాజ హితాన్ని ముందుంచి అవయవ దానానికి ముందుకొచ్చిన తల్లితండ్రులను మండల ప్రజలు అభినందించారు.

# విమానయానానికి వార్ సెగ..

## ఈ సమ్మర్‌లో 10% తగ్గనున్న సర్వీసులు




న్యూఢిల్లీ, : భారతీయ విమానయాన రంగంపై పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో ఇప్పటికే గల్ఫ్ దేశాలకు దేశీయ విమానయాన సంస్థలు 72 శాతం సర్వీసులను తగ్గించేశాయి. దాదాపు నెల రోజుల క్రితం ఫిబ్రవరి 28న వార్ మొదలవగా.. అప్పట్నుంచి మిడిల్ ఈస్ట్ దేశాలకు విమానాలు నడుపుతున్న భారతీయ సంస్థలు ప్రతి నాల్గింటిలో సుమారు మూడింటిని రద్దు చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి సమ్మర్ లోనూ విమానాల సంఖ్యను తగ్గించేయనున్నాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన తాజా షెడ్యూల్ ప్రకారం.. మార్చి 29 నుంచి అక్టోబర్ 24 వరకు దేశీయంగా వారానికి 23,049 విమానాలే నడువనున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో నడిచినవి 25,610గా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది 10 శాతం (2,561 విమానాలు) రద్దీ తగ్గనున్నది. ఈ మేరకు డీజీసీఏకు చెందిన ఓ సీనియర్ అధికారి స్పష్టం చేశారు.

ఎందుకీ పరిస్థితి?: ఈ ఏడాది మార్కెట్‌లో అనిశ్చిత పరిస్థితి అధికంగా ఉన్నదని విమానయాన సంస్థల వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల నడుమ ఈసారి దుబాయ్ తదితర గల్ఫ్ ప్రాంతాలకు విమాన సర్వీసులు బాగా తగ్గిపోయాయి. అలాగే అమెరికా-ఇజ్రాయెల్ దేశాలకు మద్దతుగా ఉంటున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దీంతో అక్కడ ముడి చమురు ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరల్ని ఎగదోస్తుండగా.. విమానాల నిర్వహణ వ్యయం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఫలితంగా టికెట్ రేట్లను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇవన్నీ కూడా చాలామంది సమ్మర్ టూర్లను ప్రభావితం చేస్తున్నాయని ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు చెప్తున్నారు. ఇందుకు తగ్గట్టే విమాన సర్వీసుల సంఖ్యనూ తగ్గించేందుకు విమానయాన కంపెనీలు నిర్ణయించాయి. వచ్చే నెల ఏప్రిల్ నుంచి రోజూ దాదాపు 2వేల విమానాలను నడపాలని ఇండిగో భావించింది. అయితే ఇప్పుడు మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల దృష్ట్యా పునరాలోచనలో పడింది. పెరుగుతున్న ఇంధన ధరలు, పడిపోతున్న రూపాయి మారకం విలువ కూడా విమానయాన రంగంపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

ఎయిర్‌లైన్స్‌కు ట్రిపుల్ షాక్: పశ్చిమాసియా సంక్షోభంతో ఎయిర్‌లైన్స్‌కు మూడు రకాలుగా నష్టం వాటిల్లుతున్నది. ఒకటి పెరుగుతున్న ఇంధన ధరలైతే, మరొకటి యుద్ధం కారణంగా ఆయా దేశాలు తమ గగనతలాలను మూసివేయడం, ఇంకొకటి రూపాయి నష్టాలు. పెరిగిన ఇంధన ధరలతో ప్రయాణికులు చార్జీల భారం మోపాల్సి వస్తుండటంతో వ్యాపారం దెబ్బతింటున్నది. అలాగే వివిధ దేశాల్లో గగనతల ఆంక్షలతో ఆయా మార్గాల్లో గమ్యస్థానాలను చేరాలంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తున్నది. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలకు పతనమవుతుండటం కూడా ఎయిర్‌లైన్స్‌కు మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నది. ఎయిర్‌క్రాఫ్ట్ లీజులు, నిర్వహణ వ్యయం, విడిభాగాల కొనుగోలు, విదేశీ సిబ్బంది వేతనాల చెల్లింపులు వంటి డాలర్ ఆధారిత ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని ఎయిర్‌లైన్స్ లబోదిబోమంటున్నాయిప్పుడు. ఏప్రిల్ నుంచి మొదలు..: పెరుగుతున్న చమురు ధరల ప్రభావం.. ఏప్రిల్ నుంచి విమానయాన ఇంధన (ఏటీఎఫ్) ధరల సవరణల్లో కనిపించవచ్చని భారత పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అంటున్నారు. ఆర్థికపరంగా ఈ సంక్షోభం పూర్తి ప్రభావం మున్ముందు ఉంటుందని ఉద్యోగులనుద్దేశిస్తూ ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ చేసిన వ్యాఖ్యలు.. కొలువుల్లో కోతల సందేహాలను రేకెత్తిస్తున్నాయి. మొత్తానికి గల్ఫ్ యుద్ధం దెబ్బకు మరిన్ని విమానాలు రద్దయ్యే వీలు లేకపోలేదన్న అభిప్రాయాలే ఇండస్ట్రీ నుంచి వ్యక్తమవుతుండటం గమనార్హం. గత నెల ఫిబ్రవరి 28 నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన ప్రతి నాలుగు విమానాల్లో మూడింటిని రద్దు చేసిన భారతీయ విమానయాన సంస్థలు. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్ కంపెనీలు దాదాపు 2,400 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. నెల రోజుల్లో షెడ్యూల్ ప్రకారం భారత్ నుంచి మిడిల్ ఈస్ట్ దేశాలకు 3,300 విమానాలు నడువాల్సి ఉన్నది. అంటే 72 శాతం క్యాన్సిల్ అయ్యాయన్నమాట. భారత్ నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికుల్లో దాదాపు సగం మంది గల్ఫ్ దేశాలకే. గత ఏడాది ఒక్క యూఏఈకే 1.21 కోట్ల మంది భారత్ నుంచి వెళ్లారు. సౌదీ అరేబియాకు కూడా నిరుడు సుమారు 30 లక్షల మంది భారతీయులు వెళ్లారు. ఒమన్, కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లకూ రద్దీ ఎక్కువే. దీంతో దేశీయ విమానయాన సంస్థల ఆదాయానికి ఈ యుద్ధం గండి కొట్టినట్టే అవుతున్నది. దేశీయ విమానయాన రంగ దిగ్గజం ఇండిగో అంతర్జాతీయ ప్రయాణికుల వాటాలో 35-45 శాతం పశ్చిమాసియా దేశాలదే. ఎయిర్ ఇండియాలో ఇది 30-35 శాతంగా ఉన్నది. మధ్య, చిన్నశ్రేణి విమానయాన సంస్థల విషయానికొస్తే.. స్పైస్‌జెట్ ఆదాయంలో దాదాపు 40 శాతం, ఆకాశ ఎయిర్‌కు సుమారు 80 శాతం విదేశీ ఆదాయం గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నది. ఈ సమ్మర్ షెడ్యూల్‌లో విమానాలు నడుపుతున్న సంస్థలివే: ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియాఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశఎయిర్, స్పైస్‌జె ట్, అలయెన్స్ ఎయిర్, ఫ్లై91 శ్రీ స్టార్ ఎయిర్, ఇండియావన్ ఎయిర్.

# స్టీల్ ప్లాంట్ క్రెడిట్ వార్




విశాఖపట్టణం : అనకాపల్లి జిల్లా నక్కపల్లి రాజయ్యపేట లో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ చుట్టూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద క్రెడిట్ వార్ నడుస్తోంది. మార్చి 23, 2026న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, దీనిపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి టీడీపీ ఇచ్చిన కౌంటర్లు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయితాడేపల్లిలో అద్దంకి పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు పునాది పడింది తన హయాంలోనే అని స్పష్టం చేశారు. 2022లో దావోస్ పర్యటనలో తాను ఆదిత్య మిట్టల్‌తో చర్చలు జరిపానని, నక్కపల్లితో పాటు పలు ప్రాంతాలను వారికి చూపించామని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందే ఈ ప్లాంట్ ఖరారైందని, ఇప్పుడు చంద్రబాబు దీనిని తన ఖాతాలో వేసుకోవాలని చూడటం క్రెడిట్ చోరీ అని విమర్శించారు. జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. గతంలో జగన్ ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ ఒడిశాలో వస్తోంది.. బాబు మాత్రం ఏపీకి వస్తుందంటూ జనం చెవిలో పూలు పెడుతున్నారు అని అన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఒడిశాకు వెళ్తుందన్న ప్లాంట్ ఇప్పుడు ఏపీకి ఎలా వచ్చింది? మీ హయాంలో ఒప్పందం జరిగితే అప్పుడే ఎందుకు శంకుస్థాపన చేయలేదు? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు. సుమారు 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్లాంట్, విశాఖ స్టీల్ ప్లాంట్ కంటే పెద్దదని ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. 2028 డిసెంబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అధికారులు వెల్లడించారు. ఒకవైపు వైఎస్సార్‌సీపీ మేము తెచ్చిన ప్రాజెక్టును బాబు వాడుకుంటున్నారు అని ప్రచారం చేస్తుంటే, మరోవైపు టీడీపీ జగన్ హయాంలో పరిశ్రమలు పారిపోయాయి.. కూటమి ప్రభుత్వం వల్లే పెట్టుబడులు వస్తున్నాయి అని కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ వార్ ప్రస్తుతం ఏపీ పాలిటిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.

# ఇప్ప పువ్వు ఎక్కడ దొరుకుతుంది? ఎలా సేకరిస్తారు..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా సాగుతున్న పీక్ టైమ్‌లో ఇప్ప పువ్వు ప్రస్తావన, సభలో రేపిన దుమారం తెలంగాణ రాజకీయాలను షేక్ చేసింది. అధికార ప్రతిపక్షాల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, క్షమాపణల డిమాండ్‌లతో నిండు సభలో ఇప్ప చేసినరాద్ధాంతం అంతా ఇంతా కాదు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్ప పువ్వు ప్రత్యేకత చాలామందికి తెలియదు. ఇప్ప సారా పేరు వినే ఉంటారు, కొంతమంది ఇప్ప సారా రుచిని ఆస్వాదించి ఉంటారు. కానీ ఇప్ప పువ్వు అంటే కేవలం సారా మాత్రమే కాదు. ఇప్ప పువ్వు అంటే తెలంగాణ గిరిజనుల జీవనాధారం, ఆకలితో కడుపు మాడ్చుకునే అడవి బిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన అమృతాహారం. తెలంగాణలోని ములుగు, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోని గిరిజన తండాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇప్ప పువ్వు విరివిగా దొరుకుతుంది. ముఖ్యంగా ఉట్నూరు ఏజెన్సీలో ఇప్ప పువ్వుకు ఉండే క్రేజే వేరు. వేసవి కాలంలో ఇప్ప చెట్ల నుంచి ఇప్ప పువ్వులు రాలుతుంటాయి. అందుకే వేసవిని గిరజనులు ఇప్ప సీజన్‌గా పిలుస్తుంటారు. ఇప్ప చెట్లు చూసేందుకు మర్రి చెట్టు మాదిరి మహా వృక్షాల్లా ఉంటాయి. ప్రతీ కొమ్మకూ ఇప్ప పువ్వులు విరగబడి పూస్తుంటాయి. చెట్టు ఎక్కకుండా నేలపై రాలిన ఇప్ప పువ్వులను మాత్రమే గిరిజనులు ఏరుతుంటారు. రాత్రం తా చెట్ల నుంచి రాలిన ఇప్ప పువ్వులను ఏరేందుకు వందల మంది గిరిజనులు ,భార్య పిల్లలతో కలసి తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచిన వెంటనే ఖాళీ కడుపుతో అడవి లోపలికి వెళతారు. సుమారు 8 నుంచి 10 కిలోమీటర్లు అడవిలోకి వెళితే తప్ప ఇప్ప చెట్లు కనిపించవు. అలా చెట్ల కింద రాలిన పువ్వులను ఏరుకుని , తిరిగి మధ్యాహ్నం 2గంటల సమయానికి ఇంటికి చేరుకున్న తరువాత మాత్రమే భోజనం చేస్తారు. అలా నెలలో 20రోజులపాటు ఇప్ప దొరికితేనే ఆరోజు గిరిజన బిడ్డల కడుపునిండేది. కిలో ఇప్ప పువ్వు ధర ఎంతంటే..?: ఇప్ప పువ్వును సేకరించిన తరువాత నాలుగు నుంచి ఐదు రోజులపాటు ఎండబెట్టి, ఎండు ద్రాక్ష రంగులోకి మారిన తరువాత బస్తాలలో తొక్కి పెట్టి నిల్వ ఉంచుతారు. అలా ఎండబెట్టిన పువ్వు సంవత్సరంపాటు నిల్వ ఉంటుంది. అడవిలో నిర్వహించే సంతల్లో ఒక్క కిలో ఇప్ప పువ్వు 40 నుంచి 50 రూపాయలకు అమ్ముతుంటారు గిరిజనులు. క్వింటా ఇప్ప పువ్వు 5 నుంచి 6వేల రూపాయలకుపైగా ధర పలుకుతుంది.

ఇప్ప పువ్వు ప్రయోజనాలు ఏంటి? : ఇప్ప పువ్వుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయంటున్నారు ఆయుర్వేద నిపుణులు. వివిధ ఆయుర్వేద మందుల తయారీలోనూ ఇప్ప పువ్వును ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇప్ప పువ్వు రసం తీసుకోవడం వల్ల కడుపులో అల్సర్, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తొలిగిపోతాయి. ఇప్ప పువ్వును నీటిలో మరిగించి, ఆ నీటిని నోటిలో పుక్కిలి పట్టడం వల్ల నోటి పూత తగ్గుతుంది. ఇప్ప పువ్వు ఆయిల్ కీళ్ల నొప్పికి అద్భుతంగా పనిచేస్తుంది. పాలతో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. ఇప్ప పువ్వు రసంతో చర్మంపై దద్దుర్లు, దురద తగ్గుతాయి. ఇప్ప పువ్వుతో చేసే లడ్డూ, కుడుములతోపాటు వివిధ రకాల స్వీట్స్, గిరిజన వంటలు రుచిలో అద్భుతంగా ఉండటమే కాదు ఆరోగ్యానికి ఓ వరం. ఇప్ప సారా తయారీ విధానం, ఆరోగ్యంపై ప్రభావం: అటవీ ప్రాంతాల్లో నిత్యం ఇప్పసారా కాయడం గిరిజన గ్రామాల్లో సర్వసాధారణం. వారం వారం నిర్వహించే గిరిజన సంతల్లో ఇప్ప సారాకు ఉండే ప్రత్యేకతే వేరు. మహానగరాలు, పట్టణాలతోపాటు దూర ప్రాంతాలను నుంచి సైతం ఇప్పసారా తాగేందుకు గిరిజన గ్రామాలకు క్యూ కడుతుంటారు. అంతలా ప్రత్యేకమైన ఇప్పసారా తయారీ విధానం వినూత్నంగా ఉంటుంది. ఎండబెట్టిన ఇప్ప పువ్వులను కడిగి రెండు లేదా మూడు రోజుల పాటు ఓ పాత్రలో నానబెడతారు. ఏ మాత్రం కదలకుండా ఇప్ప నీటిని పులయబెట్టిన తరువాత,ఓ పెద్ద పాత్రలో ఉంచి కట్టెల పొయ్యిపై కుండపైన కుండ పెడతారు. పులయబెట్టిన ఇప్పపువ్వు నీటి ఉంచిన పాత్ర కింద మంటపెడుతూ, ఆ పాత్రపైన మరో ఖాళీ కుండకు మధ్యలో సారా బయటకు వెళ్లేలా పైపు అమరుస్తారు. మట్టిపాత్రపైన మరోనీటి కుండను పెట్టి మంటపెడతారు. పులియబెట్టిన ఇప్ప పువ్వు నీరు ఆవిరిగా మారి మధ్య కుండకు ఏర్పాటు చేసిన పైపు ద్వారా బయటకు వస్తుంది. అలా వచ్చే ఇప్పసారాను ఫైనల్ గా మరో పాత్రలోకి సేకరిస్తారు. ఇలా సేకరించిన ఇప్పసారా రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యంపై ఇప్పసారా చెడు ప్రభావం చూపనప్పటికీ, సారా సేవించడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ ఇక్కడ ఇప్ప సారా తాగకుండా గిరిజనులే ఉండలేరు. ఇప్పసారా అంటే వీరి సంస్కృతిలో భాగం.

# వార్ ఎఫెక్ట్.. పీఎన్జీకి పెరుగుతున్న డిమాండ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఇరాన్ ముద్ధం మొదలై మూడూ వారాలు దాటిపోయి ంది. మనంసిలెండర్ గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుని వాటి కోసం ఎదురు చూస్తూ.. రెండు వారాలు దాటిపోతోంది. అయినా కొన్ని చోట్ల సిలిండర్లు డెలివరీ అవ్వలేదు. యుద్ధం పుణ్యమా అని ముందు ముందు పరిస్థితి ఎలా ఉండబోతోందో కూడా తెలీడం లేదు. ప్రభుత్వం కూడా నెమ్మదిగా అసలు విషయాన్ని చెబుతోంది. రాబోయే రోజుల్లో సిలెండర్ సరఫరాకు ఇబ్బంది అవుతుందని ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు వెళ్లాలంటోంది.. అందులో భాగంగా పైపుల ద్వారా సరఫరా చేసే సహజవాయివు ఉపయోగించాలని సూచిస్తోంది. ఇంతకీ హైదరాబాద్‌లో పైప్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ ఎలా పొందాలి... ఈ తరుణంలో సగటు మధ్యతరగతి యజమానికి వచ్చే ప్రధాన సందేహం ఒక్కటే.. "అసలు ఈ పైప్ గ్యాస్ కనెక్షన్ తీసుకోవడం వల్ల మనకేమైనా పైసా ఆదా అవుతుందా? లేక ఉన్న సిలిండరే బెటరా?" భాగ్యనగరంలో ఇప్పుడు అక్కడక్కడా రోడ్ల పక్కన పసుపు రంగు పైపులు కనిపిస్తున్నాయి. ఇళ్ల ముందర మీటర్లు బిగిస్తున్నారు. అవును.. నగరంలో పైప్డ్ నేచురల్ గ్యాస్ నెమ్మదిగా విస్తరిస్తోంది. హైదారబాద్‌లో పీఎన్జీ కనెక్షన్లు పొందాలంటే ... ఉన్న ఒకే ఒక్క ఆప్షన్ భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్. ఇది గెయిల్ హెచ్‌పీసీఎల్ సంయుక్త సంస్థ. పైప్డ్ గ్యాస్ కనెక్షన్ పొందడానికి ముందు మనం చూసుకోవాలసింది. ఆ ప్రాంతంలో సహజవాయి పైప్‌లైన్లు ఉన్నాయా? లేదా..? అని.. మీ ప్రాంతంలో పైపులైన్ ఉన్నట్లైతే భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌లో అప్లై చేయాలి. కనెక్షన్ మొత్తానికి సరిపడా డిపాజిట్ చెల్లిస్తే..ఇన్‌స్టేషన్ పూర్తయ్యాక.. గ్యాస్ కనెక్షన్ యాక్టివ్ అవుతుంది. మీరు అపార్ట్‌మెంట్‌లో నివసించేట్లైతే.. దానికి ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ పర్మిషన్ కావాలి.

# ఉచిత హామీలతో తడిసి ముద్దవుతున్న ఓటర్లు

చెన్నై, : ఎన్నికల వేళ ఓటర్లను ప్రసంగం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు అనేక తాయిలాలు ప్రకటిస్తూ ఉంటాయి.. అందులోనూ ఉచిత పథకాలకు పుట్టినిల్లు లాంటి తమిళనాడు ఎన్నికలంటే ఉచితాల జోరు మామూలుగా ఉండదు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఉచిత పథకాలను అక్కడి ప్రభుత్వాలు గతంలో అమలు చేసే ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేస్తూ ఉంది.

2026 అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు పొత్తుల ఏర్పాటు అంశం పూర్తి కాగానే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత వరాల జల్లులు కురిపిస్తున్నాయి.. అందులో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడిఎంకె బీజేపీతో కలిసి కూటమిగా ఏర్పాటై ఎలాగైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది. దీంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ప్రకటిస్తోంది. ఇప్పటికే అన్నాడీఎంకే చీఫ్ ఎడపాడి పళని స్వామి డీఎంకే అమలు చేస్తున్న పలు పథకాలకు కొనసాగింపుగా హామీలను ప్రకటించారు. డిఎంకె ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుండగా.. అన్నా డీఎంకే అధికారంలోకి వస్తే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీఎంకె ప్రభుత్వం 1200 వృద్ధులకు ఇస్తున్న పెన్షన్ రెండు వేలకు పెంచుతామని అన్నా డిఎంకె హామీ ఇచ్చింది. వేయి రూపాయలుగా ఉన్న మహిళలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని 2000 చేస్తామని మేనిఫెస్టోలో చేర్చింది. అలాగే.. ఇంటింటికి రూ.10వేలు ఇస్తామని పేర్కొంది. తాజాగా అన్నాడీఎంకే మ్యానిఫెస్టోలో మరికొన్ని ఉచితాలను ప్రకటించింది. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ రిఫ్రిజిరేటర్ ఉచితంగా అందిస్తామని అన్నా డీఎంకే చీఫ్ పళనిస్వామి చెప్పారు. మహిళలు స్కూటీ కొనుగోలు కోసం 25 వేలు సాయం అందిస్తామని చెప్పారు. సొంతిల్లు లేని పేదలకు అమ్మ ఇంటి నిర్మించి ఇవ్వడం కూడా అన్నా డీఎంకే మ్యానిఫెస్టోలో ఉంది.

ఉచిత రేషన్ బియ్యంతో పాటు, కిలో నూనె, కిలో కందిపప్పు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. అయితే అన్నా డీఎంకే మానిఫెస్టో ఇంతటితో పూర్తి కాలేదట.. మరిన్ని ఉచితాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు అన్నా డీఎంకే ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇంకా డీఎంకే పూర్తి స్థాయి మానిఫెస్టో ప్రకటించలేదు...

విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ మేనిఫెస్టో కూడా రావాల్సి ఉంది. ఇవన్నీ వచ్చాక అందులో ఎలాంటి ఉచితాలు ఉంటాయి.. ఆ ఉచితలను చూసి అన్నాడీఎంకే ఇంకా ఎలాంటి యాడ్ ఆన్ పథకాలను ప్రకటిస్తుందో చూడాల్సిఉందంటున్నారు.

# మాటలు సరే... చేతలు ఎక్కడా

**కడప,తెలంగాణ దిశ ::** జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 2024 ఎన్నికల ఓటమి ఒక పెద్ద కుదుపు. అయితే, ఓటమి తర్వాత ఆయన కేడర్‌లో ధైర్యం నింపడానికి, ప్రజల్లోకి వస్తానని పదేపదే చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రేపు మాపు అంటూ కాలం గడుపుతున్న తీరుపై సొంత పార్టీలోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు వైఎస్ జగన్ చేసిన ప్రకటనలను గమనిస్తే, ఆయన యాక్షన్ ప్లాన్ కేవలం ప్రకటనలకే పరిమితమైందని స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి పార్టీ నేతలతో మాట్లాడిన జగన్, "ప్రజల పక్షాన పోరాడతాం, త్వరలోనే జిల్లాల పర్యటనలు చేపడతాను" అని ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఆయన పర్యటనలు కేవలం బెంగళూరు ప్యాలెస్‌కు, తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకే పరిమితమయ్యాయి. అక్టోబర్ 2024 నుంచి జిల్లాల బాట పడతానని కేడర్ ను కలుస్తానని చెప్పారు. కానీ ఆ దసరా కూడా దాటిపోయింది. దసరా అనంతరం మీడియా ముందుకొచ్చిన జగన్, సంక్రాంతి తర్వాత జిల్లాలపర్యటనలు చేస్తానన్నారు. నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతానన్నారు. వారంలో రెండ్రోజులు పాటు జిల్లాల్లోనే ఉంటానన్నారు. అది కూడా దాటిపోయింది. క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని, బస్సు యాత్ర చేసే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ అది కూడా దాటిపోయింది. ఇప్పటికే ఏడాది అయింది. కానీ ఆయన జనంలోకి మాత్రం రాలేదు. ఇప్పుడేమో వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ చెప్తున్నారు. అంతేకాదు.. పాదయాత్రలో చంద్రబాబుకు సినిమా చూపిస్తానంటున్నారు. ఇలాంటి ప్రకటనలు కేడర్ లో తాత్కాలిక ఉత్సాహం నింపుతున్నాయి కానీ, ఇలాంటి వాటి వల్ల పార్టీకి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. గతంలో ఆయన ఇచ్చిన స్టేట్ మెంట్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దీంతో ఇప్పుడు పాదయాత్ర కూడా స్టేట్ మెంట్ కు పరిమితమైపోయే అవకాశం ఉందనే ఊహాగానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇదిగో వచ్చేస్తున్నా, అదిగో వచ్చేస్తున్నా అని చెప్పిన మరుసటి రోజే జగన్ బెంగళూరు వెళ్లిపోతున్నారు. దీంతో కేడర్ కి ఇలాంటి స్టెంట్ మెంట్స్ వినడం అలవాటైపోయింది. వాళ్లు కూడా పెద్దగా పట్టించుకోవడం మానేస్తున్నారు. ఈ సారైనా చెప్పిన మాట మీద నిలబడితే బాగుంటుందని కేడర్ కోరుకుంటోంది. జగనన్న మాట తప్పడు, మడమ తిప్పడు అని కేడర్ చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆయన చేతలు స్టేట్ మెంట్స్ కే పరిమితం అవుతుండడంతో కేడర్ లోనే అనుమానాలు మొదలవుతున్నాయి.

# సినిమా

## విశ్వంభర ట్రైలర్ అప్‌డేట్ అందుకే ఆగింది..




చిరంజీవి హీరోగా వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'విశ్వంభర'. ఇప్పటికే ఈ చిత్రం విడుదల పలుమార్లు వాయిదా పడింది. తాజా సమాచారం ప్రకారం జూన్ లేదా జులైలో విడుదల య్యే అవకాశం ఉంది. వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం కావడం, విడు దల వాయిదా పడటం, టీజర్ ఓ మాదిరిగా ఉండటం, అది ట్రోల్‌కి గురి కావడంతో సినిమాకు ఉన్న బజ్ మొత్తం తగ్గిపోయింది. అభిమా నులు సైతం ఈ సినిమా గురించి మాట్లాడుకోవడం లేదు. త్వరలో రాబోతున్న ట్రైలర్ ఆసక్తికరంగా ఉంటే తప్ప ఈ సినిమా గురించి ఎవరూ మాట్లాడుకోరని నెటిజన్లు అనుకుంటున్నారు. ఈ విషయం గ్రహించిన మేకర్స్ ట్రైలర్ కట్ విషయంలో చాలా జాగ్రత్త తీసుకోను న్నారట. అయితే వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు మాత్రం వేగంగానే జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇప్పటికే పూర్తయిన వీఎఫ్ఎక్స్ షాట్స్ నిర్మాతల చెంతకు చేరుతున్నాయి. సినిమాకు కీలకమైనఎపిసోడ్స్ మాత్రం అంచనాలకు మించి వచ్చినట్లు దర్శకుడి సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. ట్రైలర్ బయటకు వచ్చాక సినిమా గురించి బాగా మాట్లాడుకుంటారని, సినిమాకు మంచి బజ్ క్రియేట్ అవుతుందని ఇన్‌సైడ్ టాక్. అయితే శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా అప్‌డేట్ ఇద్దామనుకున్నారట. రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' గ్లింప్స్ వల్ల ఆ ఆలోచన విరమించుకున్నారని తెలిసింది. త్వరలో వచ్చే ట్రైలర్ తోపాటు సినిమా విడుదలపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఓటీటీ డీల్‌పై చర్చలు నడుస్తున్నాయి. దానిపై కూడా త్వరలో స్పష్టత రావచ్చు. చిరంజీవి సరసన త్రిష కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రాన్ని యు.వి క్రియేషన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.


## జపాన్ ప్రతినిధికి బన్నీ సాంప్రదాయ కానుక



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరోసారి తన సంస్కృతి పట్ల ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. జపాన్‌కు చెందిన గీక్ పిక్చర్స్ సీఈఓ టొమాట్సు కోసానోకు సీతారామ కళ్యాణం చిత్రపటాన్ని బహూకరించడం విశేషంగా నిలిచింది. శ్రీరామనవమి సందర్భంగా ఈ కానుకను అందించడం ద్వారా భారతీయ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఉద్దేశాన్ని అల్లు అర్జున్ వ్యక్తపరిచారు.


ఈ సందర్భంగా మన దేశ సంస్కృతి, ఇతిహాసాలు, శ్రీరాముడి కథ ప్రాముఖ్యత గురించి టొమాట్సు కోసానోకు వివరించినట్లు సమాచారం. సీతారాముల కల్యాణం చిత్రపటం భారతీయ సంస్కృతికి ప్రతీకగా భావించబడుతుంది. అలాంటి పవిత్రమైన చిత్రాన్ని విదేశీ అతిథికి బహూకరించడం ద్వారా అల్లు అర్జున్ తనలోని ఆధ్యాత్మికతను, భారతీయ వారసత్వంపై ఉన్న గౌరవాన్ని మరొసారి చాటిచెప్పారు. దీనిపై అభిమానులు, సినీ వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి. ఇటీవల భారతీయ సినిమాలకు అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న గుర్తింపు నేపథ్యంలో, ఇలాంటి సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలు ఈ విధంగా భారతీయ సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం విశేషంగా మారింది. ఇక సినిమాల విషయానికి వస్తే, అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె కథానాయికగా నటిస్తుంది. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రేక్షకులను అలరించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. పుష్ప2 చిత్రం తర్వాత బన్నీ క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పుడు అట్లీ సినిమాతో మరిన్ని రికార్డులు క్రియేట్ చేయడం ఖాయం అంటున్నారు.

## 'పెద్ది' గ్లింప్స్‌పై ట్రోల్స్.. కాపీ ఆరోపణలకు మెగా ఫ్యాన్స్ కౌంటర్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది ప్రస్తుతం టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా మారింది. చాలా కాలంగా షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా చివరి దశకు చేరుకోగా, సమ్మర్ కానుకగా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతోంది. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'పెద్ది పెహల్వాన్' గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. సోషల్ మీడియాలో ఈ వీడియో ట్రెండింగ్‌లో కొనసాగుతూ అభిమానులను ఆకట్టుకుంటోంది. 44 సెకన్ల నిడివి గల ఈ గ్లింప్స్‌లో చరణ్‌ను కుస్తీ యోధుడిగా చూపించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కండలు తిరిగిన లుక్, మైదానంలో కుస్తీ పట్టు సన్నివేశాలు, చివర్లో గదతో చేసిన విన్యాసాలు ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి. అయితే ఇదే సమయంలో ఈ గ్లింప్స్‌పై కొన్ని వర్గాల నుంచి విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పహిల్వాన్ మరియు సుల్తాన్ సినిమాలను పోలి ఉందంటూ నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు. కుస్తీ నేపథ్యంలోని కొన్ని షాట్లు 'పహిల్వాన్' టీజర్‌ను గుర్తు చేస్తున్నాయని, అందుకే ఇది కాపీ లేదా ఫ్రీమేక్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఆరోపణలకు మెగా అభిమానులు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. కుస్తీ అనే ఆట ఎక్కడైనా ఇసుకలోనే ఆడతారని, అందువల్ల కొన్ని విజువల్స్ ఒకేలా కనిపించడం సహజమని చెబుతున్నారు. చిన్న గ్లింప్స్ ఆధారంగా సినిమా కథను అంచనా వేయడం సరికాదని, పూర్తి సినిమా వచ్చిన తర్వాతే పోలికలు చెప్పాలని సూచిస్తున్నారు. నిజానికి 'పెద్ది' సినిమా కేవలం కుస్తీ నేపథ్యంలో మాత్రమే కాకుండా మల్టీ స్పోర్ట్స్ జానర్‌లో రూపొందుతోందని సమాచారం. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలు కూడా కీలకంగా ఉంటాయని టాక్. ఇప్పటికే విడుదలైన ఇతర ప్రమోషనల్ కంటెంట్‌లో రామ్ చరణ్ క్రికెటర్‌గా కనిపించగా, ఇప్పుడు కుస్తీ యోధుడిగా కొత్త కోణంలో దర్శనమిచ్చారు. కుస్తీ అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదు.. ప్రాణంతో చావుకు ఎదురెళ్లే ఆట" అనే పవర్‌ఫుల్ డైలాగ్ గ్లింప్స్‌కు హైలైట్‌గా నిలిచింది. అలాగే "చూడుమే.. ఆటే నా పొగరు" అంటూ చరణ్ చెప్పే డైలాగ్ అభిమానుల్లో మరింత హైప్‌ను పెంచుతోంది. ఇప్పటి వరకు ఒకే లుక్‌లో కనిపించిన చరణ్‌ను, ఈసారి పెహల్వాన్ అవతార్‌లో చూడటం అభిమానులకు కొత్త అనుభూతినిస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోలలో ఇలాంటి గెటప్‌లో కనిపించడం అరుదు కావడంతో 'పెద్ది'పై అంచనాలు మరింత పెరిగాయి.

## మేము కేవలం స్నేహితులమే ..





తమిళ స్టార్ హీరో ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య రిలేషన్ ఉందంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ గాసిప్స్‌పై తాజాగా మృణాల్ స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. మా మధ్య ఎలాంటి డేటింగ్ లేదు. ధనుష్ నాకు మంచి స్నేహితుడు మాత్రమే. దయచేసి తప్పుగా అర్థం చేసుకోవద్దు అంటూ ఆమె స్పష్టం చేశారు. దీంతో కొంతకాలంగా వస్తున్న రూమర్లకు బ్రేక్ పడినట్లైంది. అయితే ఈ గాసిప్స్ కొత్తవి కావు. గతంలో కూడా వీరిద్దరూ కలిసి పలు ఈవెంట్స్, పార్టీల్లో కనిపించడం, ముఖ్యంగా ఒక సినిమా ప్రీమియర్ సందర్భంగా ధనుష్ ప్రత్యేకంగా హాజరై మృణాల్‌తో సన్నిహితంగా మెలగడం వంటి పరిణామాలు ఈ వార్తలకు బలం చేకూర్చాయి. అదేవిధంగా మృణాల్ నటించిన హిందీ ప్రాజెక్ట్‌లకు ధనుష్ సోషల్ మీడియాలో స్పందించి ప్రశంసలు కురిపించడం కూడా నెటిజన్లలో అనుమానాలను పెంచింది. ఇక ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ అనర్గళంగా తమిళంలో మాట్లాడటం మరోసారి చర్చకు దారితీసింది. ఇప్పటివరకు ఆమె ఏ తమిళ చిత్రంలోనూ నటించకపోయినా, అంత స్పష్టంగా తమిళం మాట్లాడటంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం ధనుష్ అని, అతని ద్వారా ఆమె తమిళం నేర్చుకుందని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. అలాగే మృణాల్ తరచూ చెన్నై పర్యటనలు చేయడం కూడా ఈ గాసిప్స్‌కు ఊతమిచ్చింది. వీరిద్దరి మధ్య స్నేహం కంటే ఎక్కువ ఏదో ఉందనే అనుమానాలు అభిమానుల్లో మళ్లీ పెరిగాయి. అయితే, ఈ రూమర్లు సినిమాలకు ముందస్తు ప్రచారం తీసుకురావడంలో సహాయపడుతున్నప్పటికీ, అవి నిజమా కాదా అనే విషయంపై స్పష్టత మాత్రం రావడం లేదు. ఒకవైపు మృణాల్ క్లారిటీ ఇస్తున్నప్పటికీ, మరోవైపు కొత్త పరిణామాలు ఈ చర్చను కొనసాగిస్తూనే ఉన్నాయి. మరి ధనుష్--మృణాల్ ఠాకూర్ మధ్య ఉన్న బంధం నిజంగా స్నేహమేనా? లేక మరేదైనా ఉందా? అన్నది ఇంకా ఆసక్తికరంగానే మారింది. ఈ గాసిప్స్‌పై భవిష్యత్తులో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## సింపుల్‌గా పెళ్లి పీటలెక్కనున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్





టాలీవుడ్‌లో మరో యంగ్ హీరో పెళ్లి బంధంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ తనయుడు, హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో వివాహం చేసుకోనున్నారు. ప్రత్యేకత ఏమిటంటే, ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్‌గా ఈ పెళ్లిని జరపాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే తనకు కాబోయే జీవిత భాగస్వామి కావ్య రెడ్డిని సాయి శ్రీనివాస్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలు కలిసిన వేడుక ఎంతో ఆనందంగా జరిగింది. అయితే అది ఎంగేజ్మెంట్ అంటూ వచ్చిన వార్తలను సాయి శ్రీనివాస్ ఖండించారు. అది కేవలం కుటుంబ సభ్యుల మధ్య జరిగిన చిన్న పరిచయ కార్యక్రమమేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు అధికారికంగా నిశ్చితార్థానికి సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 5న హైదరాబాద్లో సాయి



శ్రీనివాస్-కావ్యల ఎంగేజ్మెంట్ జరగనుంది. ఈ వేడుకను ఇరు కుటుంబాల పెద్దలు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిర్వహించనున్నారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులకు కూడా ఆహ్వానం పంపనున్నట్లు సమాచారం. వివాహ వేడుక విషయానికి వస్తే, ఏప్రిల్ 29న తిరుపతిలో సాదాసీదాగా పెళ్లి జరపాలని నిర్ణయించారు. ఏడుకొండల వాడి సన్నిధిలో ఈ జంట వివాహ బంధంతో ఒక్కటవనున్నారు. అనంతరం మే 1న హైదరాబాద్లో సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సెలబ్రిటీ వెడ్డింగ్స్ అంటే డెస్టినేషన్ వెడ్డింగ్స్, ప్రీ-వెడ్డింగ్ పార్టీలు, బ్యాచిలర్ సెలబ్రేషన్స్ వంటి హంగామా ఎక్కువగా కనిపిస్తున్న వేళ, సాయి శ్రీనివాస్ మాత్రం సింపుల్ వెడ్డింగ్‌ను ఎంచుకోవడం విశేషంగా మారింది. ఈ నిర్ణయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కావ్య రెడ్డి విషయానికి వస్తే, ఆమెకు సినీ ఇండస్ట్రీతో ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ న్యాయవాది కుమార్తె అయిన ఆమెతో సాయి శ్రీనివాస్ కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించి ఇప్పుడు వివాహం చేసుకోబోతున్నారు. మార్చి ప్రారంభంలో జరిగిన చిన్న వేడుకలో ఆమెను పరిచయం చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇక సినిమాల పరంగా చూస్తే, గతేడాది వచ్చిన 'భైరవం', 'కిష్కింధ పురి' చిత్రాలతో మంచి విజయాలు అందుకున్న సాయి శ్రీనివాస్ ఈ ఏడాది వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో 'హైందవ', లోకమాన్య దర్శకత్వంలో 'రామమ్', అలాగే సాగర్ కె చంద్ర దర్శకత్వంలో 'టైసన్ నాయుడు' వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. త్వరలో ఈ సినిమాలకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215